రామ్‌చరణ్‌కి జాతీయ పురస్కారం వస్తుంది

8 లో..

తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

సంపుటి : 23 సంచిక : 12 | మంగళవారం డిసెంబర్ 24 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5


ఇదండీ..కబురు..



అందుకేగా ఉచితాలను ఎగ్గొడుతున్నారు!



## నమ్మక ద్రోహానికి పాల్పడుతున్న రేవంత్ ప్రభుత్వం

### నమ్మించి నట్టేట ముంచుతుంది : ఎమ్మెల్సీ కవిత

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 23

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతుల భూములను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఖండించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, అంకోల్ తండా ప్రజలను ఆదుకుంటానని నమ్మించి.. ఇప్పుడు రైతులను అప్పు చెల్లించాలంటూ వేధించడం, రైతులకు రేవంత్ రెడ్డి సర్కారు చేస్తున్న నమ్మక ద్రోహానికి నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు ఓ మాట, ఎన్నికలలో గెలిచాక మరో మాట.. ఇదీ రేవంత్ రెడ్డి గారి రెండు నాల్కల ధోరణి అంటూ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'ఎన్నికల ముందు ఓ మాట.. ఎన్నికలలో గెలిచాక మరో మాట.. ఇదీ రేవంత్ రెడ్డి గారి రెండు నాల్కల ధోరణి కామారెడ్డి జిల్లా

2లో..



## క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించిన ఒకేఒక సీఎం కేసీఆర్

- ప్రతీ క్రిస్మస్ వేడకల్లో గిఫ్టులు
- బీఆర్ఎస్ పాలనలో అన్ని మతాలకు ప్రాధాన్యం : హరీశ్‌రావు

కబురు,మెదక్, డిసెంబర్ 23

క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ప్రతి క్రిస్మస్‌కు పేద క్రిస్టియన్లకు గిఫ్ట్ ఇచ్చారని చెప్పారు. గత తొమ్మిదన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులకు కేసీఆర్ ఏం చేశారు? ఎంత బాగా చూసుకున్నారో అందరికీ తెలుసన్నారు. మెదక్ చర్చి వందేండ్ల వేడుకల్లో హరీశ్ రావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మెదక్ చర్చి వందేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వందేండ్లుగా ఆసియాలోనే రెండో అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రంగా మెదక్ చర్చి వర్ధిల్లుతున్నదని చెప్పారు.కల్లోల జగతికి శాంతి సందేశం అందించిన కరుణామయుడి గొప్ప ప్రార్థనా మందిరంగా ప్రఖ్యాతి గాంచిందన్నారు.

2లో..



# 30న తెలంగాణ కేబినెట్ భేటీ

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 23

ఈ నెల 30వ తేదీన తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. ఈ సమావేశం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.రైతు భరోసా, రేషన్ కార్డుల విధివిధానాలపై, భూమి లేని నిరుపేదలకు నగదు బదిలీపై, యాదగిరిగుట్ట ఆలయ బోర్డుపై కేబినెట్ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

## పట్నం నరేందర్ రెడ్డికి ఊరట


- బొంరాస్ పేట కేసులో ముందస్తు బెయిల్
- షరతులతో బెయిల్ ఇచ్చిన హైకోర్టు



కబురు,హైదరాబాద్ డిసెంబర్ 23

వికారాబాద్ జిల్లా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. బోంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో ఆయనకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

మిగతాది 2లో



మిగతాది 2లో

## గాంధీభవన్‌కు వెళ్లిన అల్లు అర్జున్ మామ..

### – స్పందించిన పీసీసీ అధ్యక్షుడు

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 23

కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీని హీరో అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి గాంధీభవన్‌లో కలిశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు, దీపాదాస్ మున్షీ ఉన్నారనే సమాచారంతో అయన గాంధీభవన్‌కు వెళ్లారు. పీసీసీ అధ్యక్షుడు మీడియా సమావేశంలో ఉన్నందున దీపాదాస్ మున్షీని కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



## మోహన్ బాబుకు చుక్కెదురు..!

### బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు.. నెక్ట్స్ ఏంటి..?

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 23

మీడియాపై దాడి, హత్యాయత్నం కేసులో నటుడు మోహన్‌బాబుకు చుక్కెదురైంది. మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది.. టీవీ9 జర్నలిస్ట్ రంజిత్‌పై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం మోహన్‌బాబు మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు..

2లో..

## సీవీ ఆనంద్ క్షమాపణలు..

### సహనాన్ని కోల్పోయానంటూ పోస్ట్

కబురు,హైదరాబాద్ డిసెంబర్ 23

హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ క్షమాపణలు చెప్పారు. నేషనల్ మీడియాను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు పోస్ట్ పెట్టారు. సంధ్య థియేటర్ ఘటనపై జాతీయ మీడియా ప్రశ్నలు అడిగినప్పుడు తాను సహనాన్ని కోల్పోయినట్లు తెలిపారు.

2లో..



## ఏడాదిన్నరలో పదిలక్షల ఉద్యోగాలు





- దేశ చరిత్రలో ఇదో అతిపెద్ద రికార్డు
- దేశాభివృద్ధిలో యువతే కీలక పాత్ర
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియామకపత్రాలు
- యువతను అభినందించిన ప్రధాని మోడీ

కబురు, న్యూఢిల్లీ,డిసెంబర్ 23

తమ పాలనలో యువతకు పెద్ద మొత్తంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత ఒకటిన్నర ఏళ్లలో 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. దేశ చరిత్రలో ఇది పెద్ద రికార్డ్ అని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ పక్రియలో నిజాయతీ, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. నేడు జరుగుతున్న రోజ్‌గార్ మేళాలోనూ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కొత్తగా నియామకమైన 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ చేశారు.

2లో..

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# దేశం పాడిన గాయకుడు

కిశోర్ కుమార్ మీద సంజయ్ గాంధీ కినుక వహించాడు. 'ఇరవై సూత్రాల పథకం' ప్రచారం కోసం దూరదర్శన్ లో మొదలెట్టిన 'గీతోం భరీ షామ్'లో పాడమని కిశోర్‌ని సంజయ్ గాంధీ ఆదేశించాడు. డబ్బులు లేకుండా కిశోర్ పాడడు. ఆదేశిస్తే అసలు పాడడు. దాంతో కిశోర్ గొంతుకు రేడియోలో తాళం పడింది. సినిమాల్లో పాడిస్తే ఏం గొడవోనని నిర్మాతలు వెనక్కి తగ్గారు.'ఆరాధన' సూపర్ హిట్ తర్వాత కిశోర్‌కు వచ్చిన తిప్పలు ఇవి. అప్పుడు కొంతమంది రఫీ దగ్గరకు వచ్చి 'కిశోర్‌కు శాస్తి జరిగింది. ఈ కాలాన్ని ఉపయోగించుకోండి' అన్నారు. రఫీ ఏం మాట్లాడలేదు. ఢిల్లీ వెళ్లి సంజయ్‌ను కలిశాడు. 'మీరు కిశోర్ మీద బ్యాన్ ఎత్తేయండి. అందుకు బదులుగా ఒకటి కాదు పది ప్రోగ్రామ్‌లు చేసిస్తాను' అన్నాడు. ఆ వెంటనే నౌషాద్‌ను వెంటబెట్టుకుని దూరదర్శన్‌లో ప్రోగ్రామ్ ఇచ్చాడు. కిశోర్ బ్యాన్ పోయింది.పత్రికలు కూడా కిలాడీవి. రాజేష్ ఖన్నా స్టార్‌డమ్‌తో కిశోర్ గొంతు గిరాకీలోకి రాగానే 'రఫీ పని అయిపోయింది' అని రాయడం మొదలెట్టారు. రికార్డింగులు లేక రఫీ గోళ్లు గిల్లుకుంటున్నాడని రాశారు. కిశోర్ తైనాతీలు ఇవన్నీ తెచ్చి కిశోర్‌కి చూపించారు. కిశోర్ సంతోషించాడా? ప్రెస్‌మీట్ పెట్టి 'ఇలాంటి వెధవ రాతలు మానండి. ఆయనంటే నాకు చాలా గౌరవం. మీరు ఎవర్ని గెలిపించి ఎవర్ని ఓడిస్తారు?' అన్నాడు. ఈ ఇద్దరిని కొంతమంది ఫలానా మతం అనుకుంటారు. ఈ ఇద్దరు మాత్రం ఈ దేశవాసులు. రామ్, రహీమ్‌ల సన్మతి ఎరిగినవారు.రంజాను మాసంలో రికార్డింగుకు వచ్చి 'హుక్కే మే ధువా' (హుక్కా పొగ) అనే పదం చూసి పాడనన్నాడు రఫీ ఉపవాసానికి భంగమని. మతం అంటే అంత నిష్ఠ. సాటి మతం పట్ల అంతే నిష్ఠ. 'మన్ తర్‌పత్ హరి దర్శన్ కో ఆజ్'.... 'బైజూ బావరా'లో రఫీ పాడితే కన్నీరు ఆగదు వినేవారికి. ఆ కాలంలో అనేక ఆలయాల్లో ఇది ప్రభాతగీతం. దీనిని పాడింది, రాసింది, స్వరం కట్టింది... రఫీ, షకీల్ బదాయునీ, నౌషాద్. 'నా గొంతు రొటీన్ అవుతోంది. నాకు భజనలు పాడాలని ఉంది' అని రఫీ వస్తే ఖయ్యాం ఆ కోరిక మన్నించి భజనలు పాడించి అపురూపమైన రికార్డు విడుదల చేశాడు. 'రఫీ గొంతులో దేవుడు ఉన్నాడు' అని అందరూ అనేవారే. ఆ దేవుడు అల్లాయా, ఈశ్వరుడా వెతకడం అల్పుల పని. 1950 – 70ల మధ్య మన దేశ సినీ సంగీతం దాదాపు అన్ని భాషల్లో స్వర్ణయుగం చూసింది. సినిమా – దేశవాసులను కలిపే కొత్త మతం అయ్యింది. కళాకారులు వినోద ఉల్లాసాలకే కాదు సామ రస్య, సౌభ్రాతృత్వాలకు ప్రవక్తలుగా మారారు. దేశ విభజన చేదు నుంచి జనాన్ని బయట పడేయడానికి గుర్తెరిగి బాధ్యతగా నడుచుకున్నవారే అందరూ! 'తూ హిందు బనేగా నా ముసల్మాన్ బనేగా ఇన్‌సాన్ కీ ఔలాద్ హై ఔలాద్ బనేగా'... (నువ్వు హిందువువి కావద్దు, ముసల్మానువి కావద్దు, మనిషిగా పుట్టినందున మనిషిగా మిగులు) అని సాహిర్ రాయగా రఫీ పాడి చిరస్మరణీయం చేశాడు. మదన్ మోహన్ ట్యూన్ చేసిన 'కర్‌చలే హమ్ ఫిదా'... రఫీ పాడితే నేటికీ సరిహద్దు సైనికులకు తేజోగీతమే. గాంధీజీని బలిగొన్నారన్న వార్త తెలియగానే సంగీత దర్శకులు హన్స్‌లాల్–భగత్‌రామ్, గీతకర్త రాజేంద్ర కిషన్ కలిసి ఆయనకు నివాళిగా 'సునో సునో అయ్ దునియావాలో బాపు కీ ఏ అమర్ కహానీ' రూపొందిస్తే ఇంకెవరు పాడతారు రఫీ తప్ప! బాపు పాదాల ఎదుట పారిజాతాల కుప్ప గదా ఈ పాట.సరళత్వము, తీయదనము, స్వచ్ఛత... వీటిని ప్రదర్శించడం ద్వారా ముప్పై ఏళ్ల పాటు పాడి కోట్ల మంది అభిమానులను పొందిన అమృత గాయకుడు రఫీ. 'సుహానీ రాత్ ఢల్ చుకీ, 'చౌద్‌వీ కా చాంద్ హెూ', 'బహారో ఫూల్ బర్సావో', 'ఓ దునియా కే రఖ్‌వాలే', 'ఖోయా ఖోయా చాంద్', 'దీవానా హువా బాదల్', 'క్యా హువా తేరా వాదా'... ఈ పాటలకు అంతూ పొంతూ ఉందా? కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు... ఏ ప్రాంతమో ఏ భాషో... అందరూ రఫీ అభిమానులు. రోజువారీ పనిలో, కాయకష్టంలో, సేద తీరే వేళ, వేడుకల్లో రఫీ.. రఫీ... రఫీ! కూతురిని అత్తారింటికి సాగనంపేటప్పుడు ప్రతి తండ్రి తలుచుకుని ఉద్వేగాశ్రువులు రాల్చే పాట 'బాబుల్ కి దువాయే లేతీ జా'... షంషాద్ బేగం, గీతాదత్, లతా, ఆశా... అందరూ రఫీకి జోడీలే. దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్, షమ్మీ కపూర్, అమితాబ్... అందరూ అభినయకర్తలే. రఫీ పాడటంతో సగం నటన. మిగిలిన సగమే వీరు చేయాల్సి వచ్చేది.55 ఏళ్లకు మరణించాడు రఫీ. రేపటి డిసెంబర్ 24కు శత జయంతి.

## క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించిన ఒకేఒక సీఎం కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

చర్చి నిర్మాణాన్ని ఇంగ్లాండ్‌కు చెందిన రెవరెండ్ చార్లెస్ వాకర్ ఫాస్నెట్ 1914లో ప్రారంభించారని, 1924 డిసెంబర్ 25న పూర్తయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి మనువడు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. 1914లో మెదక్ ప్రాంతంలో తీవ్ర కరువు ఉండేది. ప్రజలు ఆకలితో అలమటించేవారు. చార్లెస్ వాకర్ ఫాస్నెట్ కరువుతో అల్లాడుతన్న ప్రజలను చూసి చలించారు. ఉచితంగా కాకుండా ప్రజలకు పని చూపి, వారి ఆకలి తీర్చాలని సంకల్పించారు. అలా వారిచేత ఏసుక్రీస్తు మందిరం నిర్మిస్తూ, వారి ఆకలిని తీర్చారు. చారిత్రాకమైన ఈ చర్చి మెదక్ జిల్లాలో ఉండటం మనకే కాదు, యావత్ తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణం. కేసీఆర్ ప్రభుత్వం పోయి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయింది. గత తొమ్మిదన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో క్రిస్టియన్ సోదరులు, సోదరీమణులకు కేసీఆర్ గారు ఏం చేశారు? ఎంత బాగా చూసుకున్నారో అందరికీ తెలుసు. క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించి, ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ను అధికారికంగా జరిపిన ఒకే ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్. క్రిస్మస్ డే మరుసటి రోజు జరుపుకునే బాక్సింగ్ డేను సెలవుగా ప్రకటించారు. అంటే డిసెంబర్ 25తో పాటు 26న కూడా ఘనంగా పండుగ జరుపుకునేలా రెండు రోజులు సెలవు ఇచ్చారు. ప్రతి క్రిస్మస్ పండుగ నాడు పేద క్రిస్టియన్లకు గిఫ్ట్ ఇచ్చారు. కేసీఆర్.. ఒక్క మతమని కాదు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు ఇలా అన్ని మతాలను సమానంగా గౌరవించి, వారు సంతోషంగా జీవించేలా చూశారు. అన్ని వర్గాలు బాగున్నాయి కాబట్టే హైదరాబాద్, తెలంగాణ భిన్నత్వంలో ఏకత్వం అనడానికి నిదర్శనంగా నిలుస్తున్నది. ఇది ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను. శాంతి, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళి ఆచరణీయం. ప్రజలందరికి సుఖ శాంతుల కలగాలని ఆ యేసును ప్రార్థిస్తున్నాను. మరొక్కసారి క్రిస్టియన్ సోదర సోదరీమణులకు శుభాంక్షలు తెలుపుతున్నాను.' అని హరీశ్ రావు అన్నారు.

## నమ్మక ద్రోహానికి పాల్పడుతున్న రేవంత్ ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచుతుంది : ఎమ్మెల్సీ కవిత

మొదటి పేజీ తరువాయి

నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం, దుర్కి, నస్రుల్లాబాద్, మిర్జాపూర్, నాచుపల్లిలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతుల భూములను వేలం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. రుణాలు మాఫీ చేసి అన్నదాతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం, డబ్బులు కట్టాలంటూ అంకోల్ తండాలో రైతులపై ఒత్తిడి తీసుకురావడం, బలవంతంగా భూముల వేలానికి ప్రయత్నించడం నియంతృత్వ పాలనను తలపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, అంకోల్ తండా ప్రజలను ఆదుకుంటానని నమ్మించి.. ఇప్పుడు రైతులను అప్పు చెల్లించాలంటూ వేధించడం , రైతులకు రేవంత్ రెడ్డి సర్కారు చేస్తున్న నమ్మక ద్రోహానికి నిదర్శనం.' అంటూ ట్వీట్ చేశారు.

## గాంధీభవన్‌కు వెళ్లిన అల్లు అర్జున్ మామ.. – స్పందించిన పీసీసీ అధ్యక్షుడు

మొదటి పేజీ తరువాయి

విషయం తెలుసుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ చంద్రశేఖర్ రెడ్డికి ఫోన్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ నేత. ఆయన నాకు మంచి స్నేహితుడు. చంద్రశేఖర్ రెడ్డి వచ్చినప్పుడు నేను మీడియా సమావేశంలో ఉన్నాను. దీపాదాస్ మున్షీని ఆయన కలిశారు. ఆమెతో చంద్రశేఖర్‌రెడ్డికి పెద్దగా పరిచయం లేకపోవడంతో తొందరగా మాట్లాడి వెళ్లిపోయారు. చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి మాట్లాడాను. ఒకట్రెండు రోజుల్లో కూర్చొని మాట్లాడదాం అని చెప్పాను" అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

# సీవీ ఆనంద్ క్షమాపణలు.. సహనాన్ని కోల్పోయానంటూ పోస్ట్

మొదటి పేజీ తరువాయి

సంధ్య థియేటర్ వద్ద అసలేం జరిగిందో తెలుపుతూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. థియేటర్‌లో ఆరోజు ఏం జరిగిందో తెలుపుతూ కొన్ని వీడియోలను విడుదల చేశారు. ఈక్రమంలో మీడియా ఆయన్ను కొన్ని విషయాలపై ప్రశ్నించగా.. నేషనల్ మీడియా ఈ ఘటనకు మద్దతు ఇస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉన్న కొందరు జర్నలిస్టులు ఈ ఆరోపణలను తప్పుపట్టారు. తాజాగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సీవీ ఆనంద్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "ఈ ఘటనపై విచారణ జరుగుతోంది. ప్రెస్‌మీట్‌లో రెచ్చగొట్టే ప్రశ్నలు వేయడంతో నేను కాస్త సహనాన్ని కోల్పోయాను. పరిస్థితులు ఎలా ఉన్నా సంయమనం పాటించాల్సి ఉంటుంది. నేను చేసింది పొరబాటుగా భావిస్తున్నాను. నేషనల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. క్షమాపణలు కోరుతున్నా" అని తెలిపారు.మరోవైపు సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధానమిచ్చారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ఆయన విడుదల చేశారు. ఇక ఈ ఘటనపై తాజాగా సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి స్పందించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై తెలంగాణ సీఎం రేవంత్‌పై కేంద్రమంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు భాజపా నేతలు యత్నిస్తున్నారన్నారు. సినీ పరిశ్రమకు అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ కావాలని.. ఇలాంటి ఘటనలు జరగకుండా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు.

# మోహన్ బాబుకు చుక్కెదురు..!

మొదటి పేజీ తరువాయి

దీనిపై ధర్మాసనం సోమవారం విచారించింది. మోహన్‌బాబు ఇండియాలోనే ఉన్నట్టు అఫిడవిట్ దాఖలు చేశారు.. తన మనవరాలిని చూసేందుకు దుబాయ్ వెళ్లి తిరుపతి వచ్చినట్టు అఫిడవిట్‌లో మోహన్ బాబు పేర్కొన్నారు. మోహన్‌బాబు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆయన తరుపు లాయర్ వాదనలు వినిపించారు.. కాగా.. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి స్పందిస్తూ.. మోహన్‌బాబు మెడికల్ రిపోర్ట్ చూపించాలని కోరారు. కాగా.. మోహన్ బాబు దాడిలో గాయపడిన జర్నలిస్ట్ రంజిత్ స్టేట్‌మెంట్‌ను జీపీ కోర్టుకు సమర్పించారు.. వాదనల అనంతరం బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.జల్‌పల్లిలోని ఇంట్లోకి తనను రానివ్వలేదంటూ మంచు మనోజ్ మీడియాను తీసుకుని ఆ ఇంటి దగ్గరికి వెళ్లారు. ఈ క్రమంలో ఆవేశంగా వచ్చిన మోహన్‌బాబు..తన స్పందన తీసుకోవడానికి ప్రయత్నించిన టీవీ9 జర్నలిస్ట్ రంజిత్‌పై తీవ్రంగా దాడి చేశారు. ఈ ఘటనలో మోహన్‌బాబుపై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మోహన్‌బాబు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం మోహన్‌బాబు విజ్ఞప్తిని తోసిపుచ్చింది. మరోవైపు మోహన్‌బాబు, మనోజ్ వివాదంలో ఇప్పటికే పోలీసులు 3 FIR నమోదు చేశారు. ఇక జర్నలిస్టుపై దాడి కేసులో సినీనటుడు మోహన్‌బాబుపై కేసు నమోదు చేశామని చట్ట ప్రకారం ఆయనపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.. తెలంగాణ డీజీపీ జితేందర్.జల్‌పల్లిలో మీడియాపై దాడి, హత్యాయత్నం కేసులో మోహన్‌బాబు ఇప్పటికింకా ఎంక్వయిరీ ఫ్రేమ్‌లోకి రాలేదు. డిసెంబర్ 24వ తేదీ వరకు ఆయనకు టైముంది. ఈ క్రమంలోనే హైకోర్టు బెయిల్ పిటీషన్ ను కొట్టివేయడంతో మోహన్ బాబు బుధవారం పోలీసుల విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని చెబుతున్నారు.

# పట్నం నరేందర్ రెడ్డికి ఊరట

మొదటి పేజీ తరువాయి

సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. విచారణకు సహకరించాలని, రూ.25 వేల సొంత పూచికత్తు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. లగచర్ల దాడి ఘటనలో అరెస్టయిన నరేందర్ రెడ్డి ఇప్పటికే బెయిల్‌పై బయటికి వచ్చారు. లగచర్ల దాడి ఘటన కంటే ముందే ఆయనపై బోంరాస్ పేట పోలీసులు మరో కేసు నమోదు చేశారు. కాగా, ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ నరేందర్ రెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. కాగా, నవంబర్ 11న కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూములు సేకరించేందుకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులపై దాడి చేశారంటూ 24 మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారు. అల్లర్లకు కుట్ర చేశారంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్, సురేశ్ అనే మరో వ్యక్తిని సైతం అరెస్టు చేశారు. రైతులు, ఎమ్మెల్యేను చర్లపల్లి, సంగారెడ్డి జైళ్లకు తరలించారు. దీనిపై తెలంగాణ హైకోర్టును మాజీ ఎమ్మెల్యే ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయస్థానం 24 మంది రైతులతోపాటు పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్ మంజూరు చేసింది. డిసెంబర్ 19న ఆయన బెయిల్‌పై బయటకు వచ్చారు. కాగా, తాజాగా మరో కేసులోనూ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

# ఏడాదిన్నరలో పదిలక్షల ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కొత్తగా నియమితులైన వారిని అభినందించారు. భారతదేశ యువతతో మాట్లాండేందుకు తాను కువైట్ నుంచి రాత్రి భారత్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత దేశంలోని యువతతో తన మొదటి కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాలకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భారతదేశ యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ప్రధాని ఉద్ఘాటించారు. దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషిస్తారని.. వారిలోని సామర్థ్యాలను వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వం మరింత ముందుకువెళ్తుందని అన్నారు. ఇలా ఉద్యోగాలు పొందినవారంతా భక్తితో, నిజాయతీతో దేశం కోసం పని చేస్తున్నారని.. ఇలాగే ముందుకుసాగితే 2047 కల్లా వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని ప్రధాని వ్యాఖ్యానించారు. దేశ అభివృద్ధి యువత పైనే ఆధారపడి ఉంటుందని.. అయితే గత ప్రభుత్వాలు వారికి సరైన ఉపాధి కల్పించకపోవడం వల్ల దేశం వెనకబడిపోయిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యువతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని.. అందుకనుగుణంగా మేక్‌ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం భారత్ అన్నిరంగాల్లో ముందుకువెళ్తుందని.. అంతరిక్షం, రక్షణ, మొబైల్ తయారీ, పునరుత్పాదక ఇంధనం, పర్యటక రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళాలో అందించిన నియామక పత్రాల్లో అధిక సంఖ్యలో యువతులు ఉన్నారని మోదీ పేర్కొన్నారు. మహిళలు అన్నిరంగాల్లో స్వయంప్రతిపత్తిని సాధించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అన్ని ప్రాంతాల యువతకు అనుకూలంగా ఉండేందుకు 13 భారతీయ భాషల్లో రిక్రూట్‌మెంట్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వెల్లడించారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఈ దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ ప్రస్తావించారు. గత 10 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలనే ప్రచారం జరుగుతోందన్నారు. నేటికీ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. గత ఏడాదిన్నర కాలంలో మా ప్రభుత్వం దాదాపు 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను శాశ్వతంగా కల్పించిందని మోదీ పేర్కొన్నారు. ఇది స్వతహాగా భారీ రికార్డు అని ప్రధాని అన్నారు. ఈ విధానంలో యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి చొరవ జరగలేదని, నేడు దేశంలో లక్షలాది మంది యువత ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే యువత బలం, నాయకత్వం నుంచే పుడుతుందని ప్రధాని అభిప్రాయం వ్యక్తం చేశారు. పారదర్శకమైన సంప్రదాయం నుంచి వస్తున్న యువత పూర్తి భక్తి, నిజాయితీలతో దేశ సేవలో నిమగ్నమై ఉన్నందుకు సంతోషిస్తున్నట్లు ప్రధాని అన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దాలన్నది మా సంకల్పమన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో పూర్తి విశ్వాసం ఉందన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక విధానాలను తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్వావలంబన భారత్ ప్రచారం, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా ఇలా ప్రతి స్కీమ్ యువతను కేంద్రంగా చేసుకుని రూపొందించినట్లు వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ తన విధానాలను మార్చుకుంది. భారతదేశం తన రక్షణ రంగంలో తయారీని ప్రోత్సహించింది. దీనిలో యువత ఎక్కువగా లాభపడింది. నేడు భారతదేశ యువత కొత్త విశ్వాసంతో నిండి ఉంది. ప్రతి రంగంలోనూ యువత విజయపతాకం రెపరెపలాడుతోంది. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అవతరించామని ప్రధాని గుర్తు చేశారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థగా ఉంది. ఈ క్రమంలో ఒక యువకుడు తన సొంత స్టార్టప్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకున్నప్పుడు, వారు పూర్తి పర్యావరణ వ్యవస్థను పొందుతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నేడు దేశంలోని వేలాది మంది యువత జీవితాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ఈ రోజు ఇచ్చిన 71,000 ఉద్యోగాల్లో 29 శాతానికి పైగా ఓబీసీలు, 15.8 శాతం షెడ్యూల్ కులాలు, 9.6శాతం షెడ్యూల్ తెగలు ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే ఎన్డీఏ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనకబడిన తరగతుల రిక్రూట్‌మెంట్ 27శాతం పెరిగిందని చెప్పారు.

## విజయసాయి దోపిడి అంతాఇంతా కాదు మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శలు

వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి దోపిడీ ముఠా చేయని కుంభకోణం లేదని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. విజయసాయి వియ్యంకుడికి ఆదాయం కోసం ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు వేశారన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెన్‌కోకు విజయసాయి అనుబంధ సంస్థ బొగ్గు అమ్మిందని ఆరోపించారు. 4.5 లక్షల టన్నుల నాసిరకం బొగ్గును.. టన్ను రూ.8,500లకు విక్రయించిందన్నారు. అధిక ధరకు కొని ప్రజలపై విద్యుత్ భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ట్రైడెంట్ నాలెడ్జ్ కంపెనీ నాసిరకం బొగ్గు సరఫరాపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని.. దీనిపై సీఐడీ, విజిలెన్స్ ఎందుకు చర్యలకు ఉపక్రమించట్లేదని ప్రశ్నించారు. విజయసాయి దొంగల ముఠాపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ వినతి

కబురు న్యూస్, బోధన్, డిసెంబర్ 23

బోధన్ పట్టణ శివారులోని చెక్కి తలబ్ చెరువు కట్టను ఆక్రమించి మృతదేహాలను అక్కడే కాలుస్తూ స్మశాన వాటికగా తయారు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అజాం గంజ్ కాలనీవాసులు సోమవారం సబ్ కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల కోసం సర్వజనిక్ స్మశాన వాటికలో అన్ని వసతులతో నిర్మించినప్పటికీ కొన్ని కులస్తులవారు కట్టాను ఆక్రమించి అక్కడ మృతదేహాలను ఖననం చేస్తున్నారని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు



కబురు న్యూస్, మోస్రా, డిసెంబర్ 23

మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన పార్టీ కార్యకర్త లక్ష్మణ్ కుటుంబ సభ్యులను సోమవారం బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ జుబేర్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కార్యకర్త మృతికి సంతాపం తెలియజేసి వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని అభయమిచ్చారు. పరామర్శించిన వారిలో ప్రశాంత్ రెడ్డి, మోచి గణేష్, మాజీ సొసైటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, విజయ్ గణేష్, నరేందర్, ప్రశాంత్ యాదవ్, శివసూరి, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ న్యాయవాదులకు ఘన సన్మానం...





కబురు న్యూస్,బోధన్ డిసెంబర్ 23..

బోధన్ కోర్టులో ప్రభుత్వ న్యాయవాదులగా నూతనంగా నియమింపబడ్డ సీనియర్ న్యాయవాదులు మహమ్మద్ గౌసుద్దీన్, బొగ్గుల రవీందర్ లను ఘనంగా సన్మానించారు. సోమవారం పట్టణంలోని కోర్టు సముదాయ భవనంలో భాధ్యతలు చేపట్టిన ప్రభుత్వ న్యాయవాదులకు పులమాలలు వేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ బార్ అసోసియేషన్ కార్యదర్శి కోటేశ్వర్ రావు న్యాయవాదులు వి.ఆర్.దేశాయ్, వివిఎం.సుధాకర్, అడ్లూరి శ్రీనివాస్, సి.హెచ్.వి హన్మంతరావు, బాణోత్ రమేష్, టి.శంకర్, అజయ్, జి.రవీందర్, ధర్మయ్య, కల్యాణి, రాఘవేంద్రర్, ఫెరోజ్, వసీం, సత్యనారాయణ, గంగాధర్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## వేతన బకాయిలు ఇప్పించాలి...

### కర్మాగారం ఎదుట నల్ల బ్యాడ్జీలతో కార్మికుల నిరసన..



కబురు న్యూస్,బోధన్ డిసెంబర్ 23..



నిజాం చక్కర కర్మాగార కార్మికులకు రావాల్సిన 9ఏళ్ల వేతన బకాయిలను ఇప్పించి, కార్మికులను ఆదుకోవాలని సోమవారం కార్మిక సంఘం నాయకులు చక్కెర కర్మాగారం గేటు ఎదుట నల్ల బ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. చక్కర కర్మాగారాన్ని 2015 డిసెంబర్ 23న అర్ధరాత్రి అక్రమంగా లే ఆఫ్ చేసి కార్మికుల కుట్టుంబాలను రోడ్డు పాలు చేసిన చీకటి రోజు అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ ని పునఃప్రారంభించి, కార్మికులను ఆదుకుంటామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన ఇప్పటి వరకు కార్మికుల వేతనాలు ఇప్పించలేదని వాపోయారు. ఇక నైనా కార్మికులకు రావలసిన వేతన బకాయి వేతనాలు ఇప్పించి కార్మికులను ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక సంఘం నాయకులు ఉపేందర్, నాగుల రవిశంకర్ గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్, రాంబాబు, బీజేపీ నాయకులు రామరాజు, కార్మిక సంఘం నాయకులు ఈరవేని సత్యనారాయణ, శ్రీధర్, దాస్, భూమయ్య, శివరాములు, బిక్షపతి, తదితరులు ఉన్నారు.

# కొనసాగుతున్న కబడ్డీ కోచింగ్ క్యాంప్

- సంతోష్ కుమార్,ఏలేటి గంగారెడ్డి కోచింగ్ క్యాంపుకు చెరో 10వేల నగదు అందజేత...
- కబడ్డీ సంఘం దాతలకు ఘన సన్మానం...





కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 23 :

జనగామలో ఈనెల 27 నుండి 30 తేదీలలో 50వ జూనియర్ అండర్ 20 ఇయర్స్ బాలుర ఇంటర్ డిస్టిక్ కబడ్డీ ఛాంపియన్ జరిగే టవర్నమెంట్ కు జిల్లా కబడ్డీ జట్టు కోచింగ్ క్యాంప్ ముప్కల్ లో గల భూ దేవ్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న సందర్భంలో ఎన్ ఆర్ ఐ ఏలేటి సంతోష్ కుమార్ రెడ్డి ఈరోజు అమెరికా బయలుదేరే ముందు కబడ్డీ కోచింగ్ క్యాంప్ కు నిర్వాహనకు తన వంతు సహాయంగా పదివేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తూ క్రీడాకారులతో మాట్లాడుతూ,కబడ్డీ ఆట అంటే నాకు ఎంతో ఇష్టమని కబడి గురించి భవిష్యత్తులో కూడా అమెరికాలో ఉన్న నా యొక్క మద్దతు ఉంటుందని మీరు కష్టపడి ఆటను డెవలప్ చేసుకుని జాతీయ క్రీడాకారులుగా తయారు కావాలని కోరడం జరిగినది.మరొక్క దాత ఏలేటి గంగారెడ్డి 10000 రూపాయలను సైతం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ కె గంగాధర్ రెడ్డి కి నగదు రూపంగా అందించారు.ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి గంగారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని తాతగా ముందుకొచ్చిన సంతోష్ రెడ్డి,ఏలేటి గంగారెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా దాత ఎన్ఆర్ఐ ఏలేటి సంతోష్ కుమార్ రెడ్డిని గంగాధర్ రెడ్డి,వెంకటేష్,బుసపురం వాస్తవ్యులు బి.సునీల్ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు ముసుకు శ్రీనివాస్,సునీల్ రమేష్ నిజామాబాద్ జిల్లా కబడి అసోసియేషన్ సభ్యులు స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

# అంబేద్కర్ ను ప్రపంచ మేధావిగా గుర్తించిన ఒకే ఒక్క పార్టీ భాజపా

కబురు న్యూస్,నిజామాబాద్ డిసెంబర్ 23 :





డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని ఎప్పుడు కూడా దళిత నాయకునిగా కాకుండా ప్రపంచ మేధావిగా గుర్తించడం జరిగిందని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,దేశంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ అమిత్ షా మాట్లాడిన మాటలను వక్రీకరించి దళిత సమాజాన్ని భారతీయ జనతా పార్టీకి దూరం చేయాలని ప్రయత్నం చేస్తున్నారని కుట్రలు పన్నుతున్నారని అన్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని ఓడగొట్టినటువంటి చరిత్ర కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అంబేద్కర్ అంతక్రియలు ఢిల్లీలో కాకుండా బాంబేలో చేసినటువంటి చరిత్ర కాంగ్రెస్ అధినాయకత్వాన్ని అన్నారు.ఇష్టం లేకపోతే ఇలా అవమానించడం ఆ పార్టీకి పరిపాటే అని,అదే తరహాలో ఈ రాష్ట్రంలో కూడా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అంతక్రియలను దేశ రాజధానిలో కాకుండా హైదరాబాదులో నిర్వహించారని అన్నారు.ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని ఎప్పుడు కూడా దళిత నాయకునిగా కాకుండా ప్రపంచ మేధావిగా గుర్తించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ఒక చాయ్ వాలా ఒక బీసీ బిడ్డ ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధానమంత్రి కాగలిగిందు అంటే దానికి కారణం భారత రాజ్యాంగం ఆ భారత రాజ్యాంగాన్ని రాసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అనే విషయాన్ని నరేంద్ర మోడీ అనేక సార్లు చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. అలాంటి గొప్ప వ్యక్తిని బిజెపి పార్టీ తమ అగ్ర నేతలు అవమానించడం అనేది అసాధ్యమన్నారు. ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో దళితులంతా భారతీయ జనతా పార్టీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించారని,దీన్ని ఓర్వలేక ఇటువంటి కుట్రలను కుతంత్రాలను కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టింది అని అన్నారు. ఇలాంటి కుతంత్రాలకు భయపడే పార్టీ బిజెపి కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల బాలక్రిష్ణ, కుమార్, సందీప్,కెప్టెన్ రాజు,సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఉపయోగంలోకి తీసుకురావాలి

- అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి...
- మున్సిపాల్ అధికారులతో సమీక్షా నిర్వహించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 23 :



నగరంలో అహ్మద్ బజారులో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భారీ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఉపయోగంలోకి తీసుకురావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు.సోమవారం మున్సిపల్ శాఖ కార్యాలయంలో కమీషనర్ ఛాంబర్ లో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మున్సిపల్ అధికారులతో సమీక్షా నిర్వహించారు.నగరంలో అహ్మద్ బజారు లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భారీ వ్యయంతో నిర్మించి నిరూపయోగంగా మారిందని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని అన్నారు.నెల రోజుల సమయంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ప్రారంభించి ప్రజా ఉపయోగంలోకి తీసుకురావాలని మున్సిపాల్ కమీషనర్ ను ఆదేశించారు.నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ఫుట్ ఫాత్ కబ్జాలు, అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని వాటికీ తక్షణమే చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించినట్లు తెలియజేసారు.నగరం స్వచ్ భారత్ దిశగా క్లీన్ సిటీ చేసే బాధ్యత అందరు తీసుకోవాలని, నిజామాబాద్ కార్పొరేషన్ ను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టాలని అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలన్నారు. కార్పొరేటర్ల పదవి కాలం ముగుస్తుండటంతో కౌన్సిల్ సమావేశాలు త్వరలో నిర్వహించి డివిజన్ వారిగా ఉన్న రోడ్స్, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తగిన నిధులు మంజూరు చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమీషనర్ రాజేందర్,అసిస్టెంట్ కమీషనర్ శంకర్, మురళి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని అల్లు అర్జున్ ఆదుకోవాలి

## విలేకరుల సమావేశంలో ప్రజా శాంతి పార్టీ నేత కె.ఏ.పాల్...

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, డిసెంబర్ 23:





సంధ్యా థియేటర్ లో జరిగిన తొక్కిసలాటలో మరణించిన రేవతి కుటుంబాన్నిసినీ నటుడు అల్లు అర్జున్ ఆదుకోవాలని ప్రజా శాంతీ పార్టి అధినేత కేఏ పాల్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో కేఏ పాల్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ,అల్లు అర్జున్ బాధిత కుటుంబానికి 25 కోట్లు ఇవ్వాలని ఓ. యూ. విద్యార్థులు డిమాండ్ చేయడం తప్పా అని ప్రశ్నించారు.సిఎం రేవంత్ రెడ్డి ఒక సద్దాం హుస్సేన్ లాగా పరిపాలన చేస్తూ 422 బిల్డింగ్ లు అక్రమంగా కూల్చివేశారన్నారు.సిఎం తన తమ్ముడి బిల్డింగ్ ఎందుకు కూల్చలేదని,నాగార్జున బిల్డింగ్ ఎందుకు కూల్చారో సమాధానం చెప్పాలన్నారు.తెలంగాణలో రేవంత్ ట్యాక్స్ వసూలవుతుందని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు.కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రభుత్వాలవి పచ్చి అబద్ధాలేనని,రెండు ప్రభుత్వాల్లో సర్పంచులు అప్పుల పాలయ్యారని విమర్శించారు.నా మద్దతుతోనే రేవంత్ సీఎం అయ్యారని,రేవంత్ నన్ను వాడుకొని వదిలేశాడని,పదవులు శాశ్వతం కాదు గుర్తుపెట్టుకో రేవంత్ రెడ్డి అని కేఏ పాల్ గుర్తు చేశారు.గ్రామ పాలన కోసం నా పర్యటనలు మే 10 లోపు 100 గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తానని,మరో రెండేళ్లలో జమిలి ఎన్నికలు ఖాయమని కేఏ పాల్ అన్నారు.

కబురు
KABURU TELUGU DAILY
మంగళవారం డిసెంబర్ 24 2024

# ఘనంగా అరట్టు ఉత్సవ వేడుకలు...






కబురు న్యూస్,బోధన్ డిసెంబర్ 23..

బోధన్ పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అరట్టు ఉత్సవ వేడుకలను అయ్యప్ప స్వాములు ఘనంగా నిర్వహించారు. అరట్టు ఉత్సవం సందర్భంగా సోమవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల అయ్యప్ప స్వామి ఆలయం నుండి పట్టణ శివారు పసుపు వాగు వరకు స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంతోష్ మహారాజ్ వేద మంత్రోచ్చారాణాల నడుమ పసుపు వాగులోని పంబ నదిలో స్వామి వారికి స్నానమాచరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పసుపు వాగు నుండి తిరిగి అయ్యప్ప ఆలయం వరకు స్వామి వారి నామ స్మరణ చేస్తూ అత్యంత భక్తి శ్రద్ధలతో అయ్యప్ప ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయంలో పడి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా పెద్ద ఎత్తున విచ్చేసిన అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదాన ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు శివన్నారాయణ, గురు స్వాములు పాల్గొన్నారు.

# మహామేధావి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు

– మాజీ నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి...

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 23:



సరళీకృత విధానాలతో ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించి ప్రపంచీకరణ నేపథ్యంలో సంస్కరణలతో దేశానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించిన దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మాజీ నూడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు.సోమవారం పివి వర్ధంతి సందర్భంగా బీ ఆర్ ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పాములపర్తి వెంకట నరసింహారావు భారతదేశానికి తొమ్మిదవ ప్రధానమంత్రిగా 1991 నుంచి 1996 వరకు పనిచేశరాని అన్నారు.ఈ పదవిని అధిష్టించిన ఒకే ఒక్క తెలుగువాడు అని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి, కుంటుపడిన వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనతను సొంతం చేసుకున్న వ్యక్తి పీవీ అన్నారు.1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పి.వి రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రి గానే కాకుండా కేంద్ర రాజకీయాలలో కూడా ప్రవేశించి ప్రధానమంత్రి పదవిని చేపట్టారన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలో తగిన సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం పాటు నడిపించడం ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. అట్లాగే రైతన్నలందరికీ జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, బీ ఆర్ ఎస్ నాయకులు తెలంగాణ శంకర్,శేఖర్ రాజు,అగ్గు సంతోష్,రమేష్,విజయ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# బాక్సింగ్ ఛాంపియన్లను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో నిఖత్ జరీన్

– మంచి సంకల్పంతో నిఖత్ ముందుకు రావడం హర్షణీయం...
– నిఖత్ జరీన్ ఫౌండేషన్ ప్రారంభ వేడుకలో టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్...
– జాతీయ పోటీల్లో స్వర్ణం సాధిస్తే లక్ష నగదు బహుమతి..నిఖత్..

కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 23 :






నిజామాబాద్ బిడ్డ భారత స్టార్ బాక్సర్,ఒలింపియన్ నిఖత్ జరీన్ తెలంగాణకు గర్వకారణమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు.కఠోర శ్రమ,పట్టుదల,కష్టంతో నిఖత్ ప్రపంచ చాంపియన్‌గా ఎదిగిందని చెప్పారు.సోమవారం నిఖత్ జరీన్ ఫౌండేషన్ ప్రారంభ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణలో మరింత మంది బాక్సింగ్ చాంపియన్లను తయారు చేయాలనే మంచి సంకల్పంతో నిఖత్ ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.అనంతరం నిఖత్ జరీన్ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బాబురావు,ఒలింపిక్ సంఘం మాజీ కోశాధికారి మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**లక్ష నగదు బహుమతి:నిఖత్..**

పేద,మధ్య తరగతి బాక్సర్లకు ఈ ఫౌండేషన్ ద్వారా తోడ్పాటు అందించనున్నామని నిఖత్ జరీన్ వెల్లడించింది.వచ్చే జాతీయ బాక్సింగ్ పోటీల్లో పతకాలు కొల్లగొట్టిన తెలంగాణ బాక్సర్లకు ఫౌండేషన్ ద్వారా నగదు బహుమతి అందించనున్నామని ఆమె తెలిపింది.స్వర్ణం గెలిచిన వారికి రూ.1 లక్ష, రజతం నెగ్గితే రూ.75 వేలు,కాంస్యం సాధిస్తే రూ.50 వేలు తన ఫౌండేషన్ నుంచి ప్రదానం చేస్తానని చెప్పింది.అలానే రాష్ట్రంలో విరివిగా బాక్సింగ్ పోటీలు నిర్వహించేందుకు కూడా కృషి చేస్తానని తెలిపింది.

# పెండింగ్ వేతనాలు విడుదల చేయండి

కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,డిసెంబర్ 23 :




మెప్మా రిసోర్స్ పర్సన్స్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఏడు నెలల వేతనాలు విడుదల చేయాలని రిసోర్స్ పర్సన్స్ జిల్లా అధ్యక్షురాలు,రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణలత కలెక్టర్ ను కోరారు.మేరకు సోమవారం ప్రజావాణి సందర్భంగా నిజామాబాద్ జిల్లా కలెక్టర్కు వినతిపత్రాన్ని సమర్పించారు.నగరంలో 210 మంది రిసోర్స్ పర్సన్స్ పనిచేస్తున్నారని తెలిపారు.అయితే ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 29 మంది రిసోర్స్ పర్సన్స్ వివిధ రకాల ఆరోగ్య సమస్యల వల్ల సర్వే చేయలేకపోయామని,ఈ విషయాన్ని మా పై అధికారులకు తెలిపామన్నారు.కానీ మా జీతాలకు సంబంధించిన నవంబర్ నెల టూర్ డైరీ లు అధికారులు తీసుకోవడం లేదన్నారు.ఈ విషయమై వారిని అడగగా కేవలం సమగ్ర కుటుంబ సర్వే చేయకపోవడం వల్లే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టూర్ డైరీ తీసుకోవడం లేదని చెప్పారని కలెక్టర్కు విన్నవించారు.ఇప్పటివరకు తాము ప్రభుత్వం కు సంభందించిన అనేక రకాల సర్వేలు చేశామని,ఎప్పుడు ఏలాంటి రెమ్యూనేషన్ ఇవ్వలేదని,ప్రభుత్వానికి సంబంధించిన పనులు చేయడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కావున నవంబర్ నెలకు సంబంధించి టూర్ డైరీ తీసుకొని, పెండింగ్ లో ఉన్న ఏడు నెలల వేతనాలు విడుదల చేసేలా కృషి చేయాలి కోరారు.ఈ కార్యక్రమంలో స్వప్న,మంజుల, కళావతి,జ్యోతి, సరిత, చంద్రకళ,శోభ, స్వర్ణలత, అపర్ణ, అరుణ పాల్గొన్నారు.

## సీఎం కప్ విజేత జిల్లా బేస్ బాల్ మహిళల జట్టును అభినందించిన జిల్లా కలెక్టర్



కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,డిసెంబర్ 23 :

ఈనెల 18 నుండి 21 వరకు గచ్చిబౌలి స్టేడియం హైదరాబాదులో జరిగిన సీఎం కప్-2024 జిల్లా బేస్ బాల్ జట్టు ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా జిల్లా జట్టును జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అభినందించారు.ఈ కార్యక్రమంలో డివైస్ ఓ ముత్తన్న,జిల్లా బేస్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ మధుసూదన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్ కుమార్,జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, సంయుక్త కార్యదర్శి మర్కంటి సుజాత, సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి ప్రిన్సిపల్ పి నళిని,సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల జిల్లా స్పోర్ట్ కోఆర్డినేటర్ నీరజ రెడ్డి,జిల్లా కోచ్ లు మౌనిక,హెచ్ అనికేత్ శ్రీలత,అంజలి పాల్గొన్నారు..

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి.. అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్



కబురు న్యూస్, రుద్రూర్, డిసెంబర్ 23

బిజెపి కార్యకర్తలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల లక్ష్యంగా పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం సమన్వయంతో పనిచేసి కాషాయపు జెండా ఎగురవేయాలని అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం రుద్రూర్ మండలంలోని అంబం గ్రామంలో నియోజకవర్గ ఇన్చార్జ్ ఎండల లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు బూత్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 74వ బూత్ అధ్యక్షునిగా రవి, 75వ బూత్ అధ్యక్షునిగా శానం గంగాధర్ లను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలం చిన్న రాజులు,అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, మండల అధ్యక్షులు హరికృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ బస్ లను తనిఖీ చేసిన ఆర్టీసీ ఈడి

కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,డిసెంబర్ 23 :




నిజామాబాద్ నగరంలోని ఆర్టీసీ -2 డిపోను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషా ఖాన్ తనిఖీ చేశారు. రెండవ డిపోను సోమవారం సంధర్శించి కోత్తగా వచ్చిన ఎలక్ట్రీకల్ బస్ లతో పాటు ఛార్జింగ్ పాయింట్ లను రిజీనల్ మెనేజర్ జోష్నతో కలిసి తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మెనేజర్లు వి.శంకర్,ఎన్.సరస్వతి లతో పాటు డిపో మేనేజర్లు,సర్సనల్ ఆఫీసర్లు,అకౌంట్ అధికారులు,ఉద్యోగులు అంతకు ముందు ఖుస్రోషా ఖాన్ కు స్వాగతం పలికారు.ఈ సంధర్బంగా డిపోలో మొక్కను నాటారు.

## హమాల్ వాడిలో దొంగల స్వైరవిహారం

– మూడు చోట్ల దోంగతనం...

కబురు న్యూస్,నిజామాబాద్, డిసెంబర్ 23 :



నిజామాబాద్ నగరంలోని హమాల్ వాడిలో దొంగలు స్వైరవిహారం చేశారు.అదివారం రాత్రి మూడవ టౌన్ ప్రాంతంలోని హమాల్ వాడిలో మూడు చోట్ల దొంగలు చోరికి పాల్పడ్డారు.గుర్తు తెలియని దొంగలు ముదిరాజ్ సంఘంలో,మైసమ్మ గుడి లో చోరిలకు పాల్పడ్డారు.అలాగే మల్లారి అనురాద అనే మహిళ ఇంటిలో చోరికి పాల్పడ్డారు.ఇంటి తాళం పగుళ గోట్టి 5 తులాల బంగారు నగలు, 25 తులాల వేండి నగలు,రూ.20 వేల నగదు, టీవీని ఎత్తుకెళ్లారు.అదేవిధంగా మైసమ్మగుడిలో ఇత్తడి విగ్రహంను ఎత్తుకెళ్లారు.తరువాత వాటిని వదిలి వెళ్లడం గమనార్హం.ముదిరాజ్ సంఘం తాళాలు పగుల గొట్టిన అక్కడ ఏమి దొరకకపోవడంతో దొంగలు వెనుదిరిగారు.టౌన్ సిఐ శ్రీనివాస్ రావు, స్థానిక ఇంచార్జి ఎస్ఐ హరిబాబు ఘటన స్థలాన్న పరిశీలించారు.క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుడి స్థలం కబ్జా చేశారని అంబులెన్స్ లో వచ్చి ఫిర్యాదు

కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,డిసెంబర్ 23 :



కబ్జాలకు కాదేది అనర్హం అన్న చందంగా మారింది నిజామాబాద్ జిల్లాలో నాయకుల పరిస్థితి.ఖాళీ స్థలం కనిపిస్తే చాలు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జాలకు పాల్పడుతున్నారు.గుడి కోసం స్థలాన్ని కేటాయిస్తే ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేశారని,ఒక కుటుంబం అంబులెన్స్ లో కలెక్టరేట్ కు వచ్చింది. వివరాల్లోకి వెళితే... నిజామాబాద్ జిల్లా రూరల్ మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన మణెమ్మ అనే మహిళ గ్రామ దేవతల ఆలయం కోసం స్థలం వదిలేస్తే కొందరు కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించింది.సోమవారం ప్రజావాణి సందర్భంగా నడవలేని పరిస్థితిలో ఉన్న ఆమెను వారి కుటుంబ సభ్యులు అంబులెన్స్ లో కలెక్టరేట్కు తీసుకువచ్చారు.అధికారికి వినతి పత్రాన్ని సమర్పించి సమస్యను వివరించారు.గ్రామంలో కొంత భూమిని తాము గతంలో కొనుగోలు చేశామని మణెమ్మ తెలిపారు.అందులో కొంత భూమిని తాము రిజిస్ట్రేషన్ చేసుకోగా,మిగితా 38 గుంటల భూమిని గ్రామ దేవతల ఆలయానికి వదిలేయడం జరిగిందన్నారు. కానీ కొందరు రాజకీయ నాయకులు వారి పలుకుబడితో 38 గుంటల భూమిని కబ్జా చేసి, నకిలీ డాక్యుమెంట్స్ తో వారి పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాపోయారు. స్థలం విషయంలో వారిని ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని కావున అధికారులు చర్యలు తీసుకుని, ఆలయానికి విడిచిన స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

# నిజామాబాద్ నగరంలో సిండికేట్ కల్లు వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి

## ఇఫ్టు జిల్లా అధ్యక్షుడు పి.వరదయ్య...

కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,డిసెంబర్ 23 :

నిజామాబాద్ నగరంలో ఒకటి,రెండవ కల్లు గీత కార్మిక సొసైటీలు సిండికేట్ అయి కల్లు వ్యాపారం చేస్తున్నారని,దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ,ఇఫ్టు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పి.వరదయ్య ప్రజావాణిలో సోమవారం రోజున కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు.అంతర్గతంగా ఉన్న చీకటి ఒప్పందాన్ని,జరుగుతున్న తతంగాన్ని విలేకరులతో వెల్లడించారు.సహకార,ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా కల్లు వ్యాపారం నడిపిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గు చేటని అన్నారు.నగరంలో కృత్రిమ కల్తీ కల్లు ఏరులై పారుతున్న ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని



విమర్శించారు.మాదకద్రవ్యాలు,డ్రగ్స్ నియంత్రణ చేయాలని ప్రభుత్వం చెబుతున్న అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.వేరు వేరుగా ఉండాల్సిన ఒకటి,రెండవ నిజామాబాద్ కల్లు డిపోలు,రెండు కలిపి ఎందుకు ఒకటయ్యాయని ప్రశ్నించారు.కల్లు కాంట్రాక్టర్లుగా చలామణి అవుతున్న బడా బాబుల స్వార్థ స్వప్రయోజనాల కొరకే రెండు డిపోలని ఒకటి చేశారని పేర్కొన్నారు.నగరంలో జరుగుతున్న సిండికేట్ కల్లు వ్యాపారంపై,కృత్రిమ కల్తీ కల్లు వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని,అధికారికంగా ఎప్పటి మాదిరిగా రెండు డిపోలని నడుపుతూ కార్మికులకు న్యాయం చేయాలని కలెక్టర్ ను డిమాండ్ చేయడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బి బాస్కర్,ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి,దుద్దు గంగాధర్,ఇఫ్టు జిల్లా ఉపాధ్యక్షుడు శివ రాజు,సురేష్ తదితరులు పాల్గొన్నారు

# కలెక్టరేట్ లో క్రిస్మస్ వేడుకలు





కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,డిసెంబర్ 23 :

తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి, క్రిస్మస్ కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతి సందేశాన్ని అందించే ఈ క్రిస్మస్ వేడుకను క్రైస్తవులు అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ వేడుకల్లో రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్,ఆయా శాఖల అధికారులు,సిబ్బంది, టీఎన్జీఓల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## మురికి కాలువలో పడి వ్యక్తి మృతి



కబురు న్యూస్,నిజామాబాద్ రూరల్,డిసెంబర్ 23 :

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కంటేశ్వర్ బైపాస్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై అరిఫ్ సోమవారం తెలిపారు. స్థానికంగా ఉండే పండరి పూర్ చాయ్ సెంటర్ పక్కన మురికి కాలువలో వ్యక్తిపడి మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం మార్చారుకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. మృతుడు వయసు 35 నుంచి 40 సంవత్సరాల వరకు ఉండొచ్చని అంచనా వేశారు. ఎవరైనా గుర్తుపట్టి ఉంటే ఎస్ఐ: 8712659849, సిఐ: 8712659847 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# స్వర్ణ పతకం గెలుచుకొన్న మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు

కబురు న్యూస్,హైదరాబాద్,డిసెంబర్ 23 :

సీఎం కప్ బ్యాడ్మింటన్ సెలక్షన్ లో మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు మరోసారి సత్తా చాటారు.తెలంగాణ ప్రభుత్వం జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో రంగారెడ్డి జిల్లా తరఫున అండర్15 మిక్స్డ్ డబుల్స్ విభాగంలో తొలిస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని సాధించారు.వెంట్రప్రగడ లక్ష్య సంహిత, దిలీప్ జంట ఫైనల్ మ్యాచ్ లో ధృవ్, ఏంజిల్ జంటపై హోరాహోరీ గా తలపడి 15/13,12/15,12/15 స్కోర్ తో గెలుపొందారు. వీరికి శిక్షణ ఇచ్చిన మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్, చైర్మన్ వేణు ముప్పాల




మాట్లాడుతూ లక్ష్య సంహిత, దిలీప్ ఈ నెల 27 న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.పల్లె నుంచి ప్రపంచ స్థాయి విజేతల కొరకు నినాదంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024 బాడ్మింటన్ మిక్స్ డబుల్స్ విభాగంలో రంగారెడ్డి జిల్లా తరఫున రాష్ట్ర స్థాయిలో ఈ నెల 27న వరంగల్ లో పాల్గొంటున్న తమ క్రీడాకారులు ఖచ్చితంగా గోల్డ్ మెడల్ గెలుచుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ కోచ్ లు జొన్నాడ శశి ,సిద్ధారెడ్డి,యశ్వంత్ ఇయ్యపు , తరుణ్ డొకల సంతోషం వ్యక్తం చేశారు.స్వర్ణం గెలుపొందిన మ్యాచ్ పాయింట్ క్రీడాకారులను తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు,స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి అభినందించారు.

## విక్రమ్ హాస్పిటల్ ఓ వృద్ధురాలు మృతి చెందింది

కబురు న్యూస్,నిజామాబాద్ క్రైమ్,డిసెంబర్ 23 :






గత 12 రోజుల క్రితం మాణిక్ బండార్ కు చెందిన అమీనా బేగం (70) విక్రమ్ హాస్పిట్ లో చేర్పించగా సోమవారం సాయంత్రం మృతి చెందింది.దమ్ము రావడంతో ఆసుపత్రిలో చెరారు.సోమవారం సాయంత్రం శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో విక్రమ్ ఆస్పత్రి వైద్యులు మరో ప్రైవేట్ ఆసుపత్రికి అంబులెన్సులో రిఫర్ చేశారు.అక్కడినుంచి మరో ఆసుపత్రికి వెళ్ళగా అప్పటికే అమీనా బేగం చనిపోయిందని స్థానిక వైద్యులు నిర్ధారించారు.కార్డియాక్ అరెస్టు ద్వారానే అమీనా బేగం చనిపోయిందని వైద్యులు చెబుతుండగా,కానీ కుటుంబ సభ్యులు మాత్రం అమీనా బేగం చనిపోయిన తర్వాతనే రిఫర్ చేశారని ఆరోపిస్తున్నారు.ఇతర ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లిన అమీనా బేగం మృతి చెందగా ఆమె డెడ్ బాడీని తీసుకువచ్చి విక్రమ్ హాస్పిటల్ లో తీసుకెళ్లేందుకు ఎక్కించగా పోలీసులు అడ్డుకున్నారు.ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొని ఉన్నది.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**- అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్న కలెక్టర్...**

కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,డిసెంబర్ 23 :




ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటదివెంట పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 149 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్,కిరణ్ కుమార్,ఇంచార్జ్ డీపీఓ శ్రీనివాస్,నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొలంగూర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా గణిత శాస్త్రవేత్త శ్రీ రామనుజన్ జయంతి వేడుకలు...

- పాఠశాలలో మేళ ఏర్పాటుచేసిన హెచ్ఎం...
- ఉపాధ్యాయినీలకు ఘన సన్మానం....

కబురు న్యూస్,శంకరపట్నం డిసెంబర్ 23

గణిత శాస్త్రవేత్త శ్రీ రామానుజన్ జయంతి వేడుకలను ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపధ్యాయురాలు కంకణాల నీరజ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకర పట్నం మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత శాస్త్ర వేత్త శ్రీ రామానుజన్ జయంతిని పురస్కరించుకొని. పాఠశాలలో మేళ నిర్వహించడం జరిగిందని, విద్యార్థిని, విద్యార్థులు తయారుచేసిన పలు ఎక్సహిబిట్లు,మోడళ్లు ప్రదర్శించారు..గణిత ప్రతిజ్ఞ,క్విజ్,గణిత పజిల్స్,గణితంనకు సంబంధించిన వివిధ రకాల విశేషాలు ప్రదర్శించాలని, విద్యార్థిని, విద్యార్థులు

# బెల్లంపల్లి -సింగరేణి ఆవిర్భావ దినోత్సవం డిసెంబర్ 23 పై సీఎండీ శ్రీ బల రామ్ కి అభినందనలు తో వినతి .....




**కబురు న్యూస్, బెల్లంపల్లి డిసెంబర్ 23...**
భారత దేశం లోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని సింగరేణి కోల్ కాల రిస్ పై ఉమ్మడి కొత్త గూడెం జిల్లా లోని ఇల్లందు లో మొదటి బొగ్గుగని నిర్మాణం ద్వారా బొగ్గు ఉపరీతల ము నుండి బొగ్గు బయటకి తెచ్చి నల్ల సూర్యులు గా బొగ్గు ను బయట కు తెచ్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ను పోషించిన సింగరేణి సంస్థ లో రికార్డు స్థాయి లో వేల కోట్ల లాభం తెచ్చిన బెల్లంపల్లి ని సింగరేణి సంస్థ బొగ్గు లేదని జనరల్ మేనజర్ కార్యాలయం నీ గోలేటి కు షిఫ్ట్ పై కాంట వద్ద గల సింగరేణి అండర్ గ్రౌండ్ మైన్ కొన్ని రాజకీయ పార్టీ ల అవినీతి వల్ల ఇచట బొగ్గు గని నీ లోక్ పై సంస్థ సీఎండీ శ్రీ బలరామ్ ఈ గని ప్రారంభం పై కాంగ్రెస్ పార్టీ నేత గా డిమాండ్ చేస్తూ కన్నల బస్తీ లోని పాల్ టెక్నిక్ కాలేజ్ ను సింగరేణి సంస్థ ద్వారా కోల్ బెల్ట్ ఇంజనీరింగ్ కాలేజీ గా తీర్చి దిదడాలని బెల్లంపల్లి లో సింగరేణి షాప్స్ పరధి నము పై వందల కోట్ల భూములు షాప్స క్వార్టర్ లు మున్సిపల్ పరం వల్ల నేడు షాప్స్ 30లక్షల రూపాయలు నుండి 50!లక్షల రూపాయలు అమ్ముకోవడం క్వార్టర్ లు స్టేట్ నేను బ్యాంకు అఫ్ ఇండియా కాంట వద్ద పట్టపగలు భూ కబ్జా వల్ల భూ కబ్జా దారులపై సింగరేణి సంస్థ ప్రాంతం బిడ్డ గా 23-12-2024న ఈ కబ్జా పై సిబిఐ విచారణ కి సిబిఐ డైరెక్టర్ కీ లేక రాస్తున్నాను మన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన లో సింగరేణి చరిత్ర లోనే లాభాల బోనస్ దాదాపు ఒక్కో కార్మికుడు కీ రెండు లక్షల రూపాయలు ఇవ్వడం పై బెల్లంపల్లి లో సింగరేణి సంస్థ సోలార్ ప్లాంట్ ఏర్పాట్లు పై స్థానిక సింగరేణి కార్మికుల వారసులకీ ఉద్యోగం ఇవ్వాలి అని సింగరేణి హాస్పిటల్ లో వైద్య నిపుణులను నియమించి కార్మికులకీ అదున తన వైద్యం అందిస్తూ సింగరేణి హాస్పిటల్ లో బ్లడ్ బ్యాంకు ఏర్పాట్లు చేస్తూ శాంతి ఖని లో 50ఎకరాలు ఖాళీ స్థలం లో సింగరేణి సంస్థ సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేసి సింగరేణి కార్మికుల పిల్లలు బీటెక్ చదవి నేడు పునా నాగపూర్ హైదరాబాద్ వరంగల్ బెంగళూరు లో ఉద్యోగం పై సీఎండీ బల రామ్ కి వినతి చేస్తూ సింగరేణి సంస్థ ఆవిర్భావ వేల సీఎండీ బల రామ్ మంద మరి జనరల్ మేనజర్ గాజర్ల దేవేందర్ కి శుభాకాంక్షలు తెలియచేస్తూ నూతన సంత్సర శుభాకాంక్షలు నమస్కారం లతో సింగరేణి బెల్లంపల్లి మీ కొలిపాక శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి నాయకులు 9133135710 రేవంత్ రెడ్డి సైన్యం ప్రధాన కార్యదర్శి

# గుడిసెలపోరాటానికి సిద్ధంకాండి...

**- గ్రామప్రజలకు మోరె గణేష్ పిలుపు...**
**- అక్రమ అరెస్టులతో భూ పోరాటాన్ని ఆపలేరు...**
**- ఆక్రమణకు గురైన భూమిని పేదలకు పంచాలి...గణేష్....**





**కబురు న్యూస్, శంకరపట్నం డిసెంబర్ 23**
గ్రామ ప్రజలు గుడిసెల పోరాటానికి సిద్ధం కావాలని, అక్రమ అరెస్టులతో భూ పోరాటాన్ని ఆపలేరని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ పోరంపోగు భూములు స్వాధీనం చేసుకొని పేదలకు పంచేవరకు తన పోరాటం ఆగదని మోరె గణేష్ సోమవారం హెచ్చరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామంలో సర్వే నంబర్ 703,378 ప్రభుత్వ భూమిని కొంతమంది భూస్వాములు ఆక్రమించుకొని, సాగు చేసుకుంటున్నారని, తాను అట్టి భూమిని ప్రభుత్వము స్వాధీనం చేసుకున మొలంగూర్ గ్రామంలోని ఇండ్లు లేని ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ పేదలకు, తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లకు ఇండ్లు లేని పేదలందరికీ పంచాలని, కాంగ్రెస్ పార్టీ పాలకులకు, ప్రభుత్వ అధికారులకు, మొలంగూర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో, వెలుగునీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనేక విన్నపాలు ఫిర్యాదులు అందజేసినట్లు పేర్కొన్నారు. శంకరపట్నం మండల సర్వే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, నెలలు గడిచిన 703,378 సర్వే నంబర్ లోని ప్రభుత్వ భూమిని కొలతలు వేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని మొలంగూర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టడం జరిగిందని, సమాచారం తెలుసుకున్న కేశవపట్నం పోలీసులు ముందస్తుగా సోమవారం తెల్లవారుజామున తనను ఇంటికి వచ్చి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాలకులు స్పందించి తక్షణమే 703,378 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిని సర్వే చేయించి, ఇండ్లు లేని పేదలందరికీ ప్రభుత్వము భూమి జాగా కేటాయించి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేయుటకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎన్ని అరెస్టులు చేయించినా గుడిసెల భూ పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్వల గ్రామ మాజీ సర్పంచ్ దాసారపు భద్రయ్య, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు అంతడుల సతీష్, మొలంగూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పి.వి సేవలు చిరస్మరణీయం - జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్

**కబురు న్యూస్, జమ్మికుంట డిసెంబర్ 23...**




**జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ ఆదేశాల మేరకు, దివంగత ప్రధాని పి.వి నరసింహారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.**

యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివంగత ప్రధాని పి.వి నరసింహారావు వర్ధంతి కార్యక్రమంలో భాగంగా యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని పి.వి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.నాయకులు మాట్లాడుతూబీ దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. పివి నరసింహారావు దక్షిణ భారతదేశం నుంచి తెలుగువారిగా ఈ దేశానికి సేవలు అందించిన మొట్టమొదటి ప్రధానిగా విశేష సేవలు అందించిన ఘనత పి.వి ది అని నాయకులు అన్నారు.ముఖ్యమంత్రిగా ఎన్ని ఇబ్బందులు ఎదురైన ముఖ్యమంత్రి పదవి త్యాగం చేయాల్సి వస్తుందని తెలిసి కూడా అనేక సంస్కరణలు తీసుకొచ్చి, ముఖ్యంగా భూసంస్కరణలతో లక్షలాది మంది పేదలకు భూములు అందేలా కృషి చేసిన గొప్ప చరిత్ర పీవీ ది.భారతదేశం తీవ్రమైనటువంటి ఆర్థిక సంక్షోభానికి గురైన సందర్భంలో, ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశ చరిత్రలో గొప్పగా ఆర్థిక సంస్కరణలను అమలు చేసి, దేశ ఆర్థిక పరిస్థితుల్ని గాడిలో పెట్టిన గొప్ప చరిత్ర అని నాయకులు గుర్తు చేశారు. దేవి గారి సేవల్ని వారి ఆలోచన విధానాలను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముందుకు తీసుకెళ్తామని ముందు తరాలకు తెలియజేస్తామని యూత్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలోబీ తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకులు అన్నం ప్రవీణ్, జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు సాగర్, ప్రధాన కార్యదర్శి బీజిగిరి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేల్పుల ప్రశాంత్, రాజేందర్, రాజు, జావిద్, అంజి, రాజ్ కుమార్, అష్రఫ్, వంశీ, మహేష్, నభి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాయుసేనలో అగ్నివీర్ వాయు పోస్టుల కోసం ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలి

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**

**కబురు న్యూస్, నిజామాబాద్ కలెక్టరేట్,డిసెంబర్ 23 :**






భారత వాయు సేన (ఇండియన్ ఎయిర్ ఫోర్స్)లో అగ్నివీర్ వాయు పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేశారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. అర్హులైన యువతీ,యువకులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అగ్నివీర్ వాయు పోస్టుల భర్తీ కోసం భారత వాయు సేన అర్హులైన అవివాహిత స్త్రీ, పురుష అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండి, 2005 జనవరి 01 నుండి 2008 జూలై 01వ తేదీ మధ్యన జన్మించి ఉండాలన్నారు.అర్హులైన వారు 2025 జనవరి 07 నుండి జనవరి 27 వ తేదీ లోపు https://agnipathvayu.cdac.in ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకున్న వారికి 2025 మార్చ్ 22 నుండి ఆన్లైన్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారని తెలిపారు.జిల్లాకు చెందిన అర్హులైన యువతీ,యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# దేశానికి పీవీ చేసిన సేవలు మరువలేనివి..ప్రణవ్.



**- ఆర్థిక సంస్కరణలకు ఆద్యం పోసిన మేధావి పీవీ.**
**- కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రణవ్.**

**కబురు న్యూస్, హుజురాబాద్ డిసెంబర్ 23...**



క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టీ,టెక్నాలజీ,మొబైల్ రంగంలో ప్రైవేటీకరణ చేసి దేశంలో వినూత్న మార్పు తీసుకొచ్చి దేశం అభివృద్ధి విషయంలో ఇతర దేశాలకు పోటి పడేలా చేసిన వ్యక్తి పీవీ నరసింహారావు అని ఆయన తీసుకున్న నిర్ణయాలే దేశానికి పునదిరాళ్ళుగా మారాయని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.సోమవారం నాడు పీవీ 20వ వర్ధంతి సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బహుభాషా కోవిదుడుగా పేరుగాంచి కార్యకర్త స్థాయి నుండి ప్రధాని వరకు పనిచేసి కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు చేశారని అన్నారు.విద్యా వ్యవస్థలో నవోదయ పాఠశాలను నెలకొల్పి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తోడ్పాడని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి నినాదం ఒకే కుటుంబం, ఒకే లక్ష్యం, ఒకే గమ్యం గోడ మీద రాతలకే పరిమితమైందని...

**క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని సిఐటియు అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు కుమారస్వామి అసహనం వ్యక్తం చేశారు......**

**కబురు న్యూస్, గోదావరిఖని డిసెంబర్ 23....**



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కాంట్రాక్టు కార్మికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన ఆర్జీ-1 జిఎం లలిత్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు. సంస్థ అభివృద్ధి, ఉత్పత్తిలో భాగస్వాములైన కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బొగ్గు ఉత్పత్తిలో పర్మనెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సమాన హక్కులను కల్పించాలని కుమారస్వామి డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల తోపాటు వారి కుటుంబ సభ్యులకు సింగరేణి ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని... ఖాళీగా ఉన్న క్వార్టర్లను వారికి కేటాయించాలని యాజమాన్యానికి సూచించారు. అధికారికంగా చెందాల్సిన వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని... సంస్థ లాభాల వాటాను కాంట్రాక్టు కార్మికులకు పొంచాలన్నారు. సింగరేణి సంస్థ నవ వసంతంలోకి అడుగుపెడుతున్న వేళ కాంట్రాక్టు కార్మికులకు చట్ట ప్రకారం హక్కులు కల్పించాలని కుమారస్వామి కోరారు.

# సమాజంలో సామరస్యం వెల్లి విరియాలి...

**- ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**కబురు న్యూస్, :శంకరపట్నం డిసెంబర్ 23**





సమాజంలో సామరస్యం వెల్లివిరియాలంటే యేసు బోధనలను ఆచరించటమే మార్గమని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్.ఎం.డీ కాలనీలోని అరుంధతీ ఫంక్షన్ హాల్ లో సోమవారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముందస్తు క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రేమ భావాన్ని, సేవాతత్పరతన, క్షమాగుణాన్ని బోధించారని, వీటిని ఆచరించడం ద్వారా మనిషి సన్మార్గంలో నడవాలన్నారు. క్రైస్తవులకు అత్యంత ప్రీతికరమైన క్రిస్మస్ ను ఆనందోత్సహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని, క్రిస్మస్ పండుగతో ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు నెల కొనాలని,సమాజంలో సామరస్యం వెల్లివిరియాలని ఆయన ఆకాక్షించారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ తహసీల్దార్ విజయ్ కుమార్, శంకరపట్నం తహసీల్దార్ బత్తుల భాస్కర్, ఇల్లంతకుంట తహసీల్దార్ ఫారుఖ్, గన్నేరువరం తహసీల్దార్ నరేందర్, మానకొండూర్ డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఆర్ఐ సతీష్, పాస్టర్లు సామ్యేల్, ఇషాక్ తోపాటు రాజిరెడ్డి,జాన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోండా మార్కెట్ సమగ్ర అభివృద్ధికి త్వరలో ప్రణాళికలు

**కబురు న్యూస్, హైదరాబాద్ డిసెంబర్ 23**

ఎంతో చరిత్ర కలిగిన మోండా మార్కెట్ సమగ్ర అభివృద్ధికి త్వరలో ప్రణాళికలు రూపొందించనున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి మోండా మార్కెట్ మొత్తం కలియతిరిగారు. వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి...సమస్యలు ఏమైనా ఉన్నాయా అని పలువురు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను MLA దృష్టికి తీసుకు రాగా వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా MLA తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన మోండా మార్కెట్ పై ఆధారపడి వేలాదిమంది జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని రకాల కూరగాయలతో పాటు ఇంట్లోకి అవసరమైన నిత్యావసర వస్తువులు ఒకేచోట లభించే మోండా మార్కెట్ కు ఒక్క హైదరాబాద్ నగరంలోని ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుండి కూడా ప్రజలు వచ్చేవారని వివరించారు. హోల్ సేల్ మరియు రిటైల్ వ్యాపారాలతో ఎంతో గుర్తింపు పొందిన మోండా మార్కెట్ నేడు సరైన వ్యాపారాలు లేకపోవడంతో వ్యాపారులు కూడా కొంత ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రతి బజారులో కూరగాయలు, నిత్యావసర వస్తువులు అమ్మే షాపులు ఏర్పాటు కావడమే ఇందుకు కారణంగా ఆయన చెప్పారు. మార్కెట్ లో సరైన సౌకర్యాలు, వసతులు లేకపోవడం వలన వ్యాపారులతో పాటు మార్కెట్ కు వచ్చే ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మార్కెట్ లో ఉన్న చెత్త డంపింగ్ యార్డ్ లోని చెత్త చెల్లాచెదురు అవుతుందని, దీంతో తాము ఇబ్బందులు



పడాల్సి వస్తుందని పలువురు వ్యాపారులు MLAదృష్టికి తీసుకురాగా దాని చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మార్కెట్ లోని రెండు చోట్ల మ్యాన్ హోల్స్ దెబ్బతిని ఉండటాన్ని గమనించిన MLA వెంటనే వాటి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నూతన రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ లో తిరుగుతున్న పశువుల వలన అనేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని MLA దృష్టికి తీసుకురాగా, వెంటనే పశువుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంతో చరిత్ర కలిగిన మోండా మార్కెట్ ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై త్వరలోనే అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రణాళికలను రూపొందించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి....తలసాని

ఇటీవల మోండా మార్కెట్ లో అగ్నిప్రమాదం జరిగి నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని MLA తలసాని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన షాపులను సందర్శించి బాధితులను పరామర్శించారు. ముగ్గురు బాధితులకు తన వ్యక్తిగతంగా ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. బాధితులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన నష్టపరిహారం వీలైనంత త్వరగా మంజూరు అయ్యే విధంగా చూడాలని తహసిల్దార్ పాండు నాయక్ ను ఆదేశించారు. ప్రమాదం కు గల కారణాలను బాధితులు, స్థానిక వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం బాధితులకు వెంటనే నష్టపరిహారం అందజేయడం ద్వారా కష్టకాలంలో ఆసరా అవుతుందని చెప్పారు. రాత్రి వేళల్లో ఆకతాయిలు చలిమంటలు వేసుకొని నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుందని వివరించారు. ఇక ముందు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా రాత్రి వేళల్లో మోండా మార్కెట్ లో పోలీసు గస్తీ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మార్కెట్ లో అవసరమైన ప్రాంతాలలో మార్కెట్ వ్యాపారుల సహకారంతో CC కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్ కు వాటిని అనుసంధానం చేయడం ద్వారా పర్యవేక్షణ జరపాలని అన్నారు. MLA వెంట సికింద్రాబాద్ తహసిల్దార్ పాండు నాయక్, EE సుదర్శన్, శానిటేషన్ DE దేవేందర్ రెడ్డి, మోండా మార్కెట్ CI రామకృష్ణ, ట్రాఫిక్ CI, స్ట్రీట్ లైట్ AE అనూష, మార్కెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధు, BRS పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు రాములు, మహేందర్, మహేష్ యాదవ్, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, శ్రీహరి తదితరులు ఉన్నారు.

# 21,000 కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం

**కబురు న్యూస్, హైదరాబాద్ డిసెంబర్ 23**

అసెంబ్లీ సమావేశాల సందర్భముగా "రైతు భరోసా" పై చర్చ పెట్టి గౌరవసభ్యులు అభిప్రాయాలను తెలియజెయ్యమని అడిగితే, గత ప్రభుత్వములో మంత్రులుగా పనిచేసి గత పది సంవత్సరాల కాలంలో ఇచ్చిన హామీలు లలో ఏ ఒక్కటి అమలు పరుచకుండా, ఇచ్చిన ఒకే ఒక "రైతుబంధు" లో కూడా 21,000 కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారు , మా ప్రభుత్వం ఇప్పుడు దానిలో కొన్ని మార్పులు చేసి సాగులో ఉన్న భూమికీ రైతుబంధు ఇద్దామని అంటే క్రొత్త క్రొత్త నాటకాలను తెరతీస్తున్నారు. మాయమాటలు చెప్పి మరొక సారి రైతాంగాన్ని ఆందోళనలో నెడుతున్నారని, లేఖలతో ఈ సారి కొత్త నాటకాలకు తెర తీస్తున్నారని గౌరవ వ్యవసాయ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు ఆక్షేపించారు .

ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ

గత పది సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా రైతు సంక్షేమానికి ప్రత్యక్షంగా బడ్జెట్ లో 35 శాతం ప్రకటించి ఖర్చు చేసినందుకా ఈ ప్రభుత్వాన్ని మీరు నిలదీయమనేది?

రైతుబంధు పథకంలో 2019-20 సంవత్సరంలో రెండు పంటకాలాలలో మీరు పూర్తిగా డబ్బులు చెల్లించని మాట వాస్తవం కాదా!

2023 యాసంగి రైతుబంధు 7600 కోట్లు ఎగ్గొట్టిన మాట వాస్తవం కాదా!

రైతుబంధు పేరు చెప్పి అన్ని పథకాలకు వ్యవసాయ యాంత్రికరణ, పంటల భీమా, డ్రిప్ ఇరిగేషన్ వంటి మరెన్నో పథకాలను అటకేక్కించి, రాష్ట్ర వాటా విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వ పథకాలైన రాష్ట్ర కృషి వికాస్ యోజన, జాతీయ ఆహార భద్రత మిషన్, నిధులు కూడా దాదాపు 3005 కోట్లు రాకుండా చేసి తెలంగాణ రైతుల సంక్షోబానికి కారణమైన మీరా ఈ ప్రభుత్వాన్ని నిలదీయమని చెప్పేది!

పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ కూడా చెల్లించక చేతులెత్తేస్తే, ఈ ప్రభుత్వం గత బకాయిలు చెల్లించి, వాటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకున్న ఈ ప్రభుత్వానికా మీరు నిలదీయమని చెప్పేది?

మీరు చేసిన రుణమాఫీ 2014, 2018 పై రైతుల వద్దకు వెళ్ళి ఆడగ గలరా? అసలు ఆ పథకాలు రుణమాఫీ అని పెట్టడం కంటే వడ్డీ మాఫీ అంటే బాగుండేడెమో!



2018 రుణమాఫీలో 20 లక్షల మందికి రుణమాఫీ ఎగ్గొట్టిన మాట వాస్తవం కాదా !

వారి పదవి కాలంలో పంట నష్టం సంభవించినపుడు నష్ట పరిహారం సంగతి అటుంచి, కనీసం రైతులను పరామర్శించని వారు, వారి %మీారూ% లను, అధికారులను కూడా అటువైపు వెళ్లొద్దని ఆదేశించిన వారు, అధికారంలోకి వచ్చిన పది నెలలలోనే రెండు విడతలు, నెల రోజుల్లోనే పంట నష్ట పరిహారం చెల్లించిన ఈ ప్రభుత్వాన్నా మీరు వేలెత్తి చూపెట్టేది?

పంట నష్టపరిహారం కోసం రైతులు హైకోర్టు గడప ఎక్కించాల్సిన పరిస్థితి సృష్టించింది మీరు కాదా !

హడావిడిగా పథకాలను ప్రకటించడం, తర్వాత దానీ ఊసే ఎత్తకపోవడం గత ప్రభుత్వ నైజం కాదా ! ప్రగతి భవన్ లో రైతులను పిల్చి సమావేశపర్చి ఎరువులు ఉచితంగా పంపిణీ చేస్తాము అని మాయమాటలు చెప్పింది ఎవరు ?

వరి వేస్తే ఉరి అని, మొక్కజొన్న వద్దు అని, సన్నాలు సాగు చేయమని, పత్తి వద్దని మీకు ఏది తోస్తే అది చెప్పి, ఏ ఒక్క సందర్భంలో కూడా మద్దతు ధర కల్పించి రైతులని ఆదుకున్న పాపాన పోనీ వైనం మీదైతే, ఈ సంవత్సర కాలంలోనే దాదాపు 695 కోట్లు వెచ్చించి, పత్తి, వరే కాకుండా రైతు పండించిన ప్రతీ పంటకు మద్దతు ధర కల్పిస్తూ, ఎకరానికి మీరు పెట్టిన పరిమితులను కూడా, పెరిగిన దిగుబడుల ఆధారంగా పెంచుతూ, కొనుగోలు చేస్తున్న మమ్మలనా మీరు నిలదీయమనేది .

సన్నాలకు 500 రూపాయలు బోనస్ ప్రకటించి, సన్నాలు సాగు చేస్తున్న రైతుకు ఎకరాకి అదనముగా రూ. 8000 నుండి రూ.12000 పొందేట్లు చేసి, రైతు అనేవారు ఏ సాయం కోసం చూడకుండా వాళ్ళ కాళ్లపైన వారు గర్వంగా నిలబడేట్టు చేస్తున్నది మా ప్రభుత్వం అన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారా !

గతంలో పామ్ఆయిల్ గెలల ధర తగ్గినప్పుడు ఎప్పుడైనా కేంద్ర ప్రభుత్వం తో మాట్లాడి రైతుల ప్రయోజనాలను పరిరక్షించారా! సంవత్సర కాలంలోనే గెలల ధరను వున్న ధర కు అధికంగా 6500/ రూపాయలు పెంచే విధంగా కృషి చేసినందుక ఈ ప్రభుత్వాన్ని నిలదీయమనేది.

ఉపకులపతులను నియమించకుండా వ్యవసాయ మరియు ఉద్యాన వర్సిటీలను నిర్లక్ష్యం చేసి మీరు కాదా !

నిరపయోగ్యంగా ఉన్న రైతు వేదికను దృశ్య శ్రావణ మద్యమం ఏర్పాటు చేసి రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు నిరంతరం శిక్షణ ఇస్తునందుకా ఈ ప్రభుత్వాన్ని మీరు నిందించేది.

ఎటువంటి బేషజాలకి పోకుండా రైతు భీమా పథకంలో 1.13 లక్షల రైతులను అదనముగా చేర్చి పథకాన్ని కొనసాగిస్తునందుకా?

వ్యవసాయ రంగములో సుస్థిర వృద్ధిని కొనసాగించేటందుకు వీలుగా వ్యవసాయ మరియు రైతు సంక్షేమం కమిషన్ ఏర్పాటు చేసినందుకా ?

ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం, ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి పైసా అర్హతగల వారికీ అందేవిధంగా చేయాలని ఆలోచన. దానికి ప్రతి ఒక్కరి మద్ధతు ఉంది.

ఇకనైనా BRS నాయకులు మాయమాటలతో అసత్య ప్రచారాలలతో ఇప్పుడిపుడే కోలుకొంటున్న రైతాంగాన్ని, ఆందోళనలోకి నెట్టి ప్రయత్నాలు మాని, రైతులకు ఉపయోగపడే విధంగా నిర్ణయాత్మక సూచనలు చేయాలని మనవి.

అదే విధంగా రైతాంగానికి మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా. అధికారంలో ఉన్న ఏనాడు కనీసం రైతుల సంక్షేమం పట్టని BRS నాయకులు, ఈ రోజు బహిరంగ లేఖలతో కపట ప్రేమ ఒలక బోస్తూన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఇంతకు ముందు చెప్పాం. మా ప్రభుత్వ ఆలోచన ఒక్కటే. సాగు చేసే భూమికి పెట్టుబడి సహాయం అందాలని అంతేగాని కొన్ని దినపత్రికలలో ప్రచురించినట్లు "40 లక్షల మందికి రైతు భరోసా కిట్", పి.ఎమ్ కిసాన్ విధానాలు ఆధారం అనేది పూర్తిగా అవాస్తవం అని గౌరవ వ్యవసాయ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు తెలియజేశారు .

# పాలకుర్తి మండలం లో ముమ్మరంగా ఇందిరమ్మ ఆప్ సర్వే





**కబురు న్యూస్, పాలకుర్తి డిసెంబర్ 23**

పాలకుర్తి మండలం లో ఇందిరమ్మ గృహ యాప్ సర్వే ముమ్మరంగా జరుగుతుంది .గన్ శ్యామ్ దాస్ నగర్ గ్రామ పంచాయతీలో 9వ వార్డు లో సోమ వారం ఇందిరమ్మ గృహ అప్ సర్వే జరుగుచున్నది ఇందిరమ్మ గృహ ఆప్ సర్వే నిర్వహించగా 2 30 గృహాలు సర్వే చేయడం జరిగింది గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్సర సుల్తానా తోపాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. బసంత్ నగర్ గ్రామపంచాయతీలో సుమారు 221 ఇందిరమ్మ గృహాలు ఇప్పటివరకు సర్వే చేయడం జరిగింది గ్రామ కార్యదర్శి కే గంగ లక్ష్మి తోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు పాలకుర్తి గ్రామంలో ఇప్పటివరకు 50 శాతం ఇందిరమ్మ సర్వే యాప్ వేగవంతంగా జరుగుతుంది ప్రజా పాలనలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి ఈ ఇందిరమ్మ యాప్ సర్వే జరుగుతుంది గ్రామ కార్యదర్శి ప్రదీప్ తో పాటు బిల్ కలెక్టర్ అహ్మద్ బేగం తో పాటు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాలకుర్తి మండలంలో శరవేగంగా ఇందిరమ్మ గృహ యాప్ సర్వే

**పాలకుర్తి ఎంపీడీవో అల్లం పూర్ణచంద్రావు**



పాలకుర్తి డిసెంబర్ 23 జన తెలంగాణ, పాలకుర్తి మండలం లోని 19 గ్రామ పంచాయతీలో సుమారు 9361 దరఖాస్తులు ప్రజాపాలనలో ఇందిరమ్మ గృహాల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు గత కొన్ని రోజుల నుండి సర్వర్ ఇబ్బందుల వల్ల గ్రామాలలో సర్వే ఇబ్బందులకు గురవుతుందని ఇప్పటివరకు సుమారు 3600 గృహాలను సర్వే చేయడం జరిగిందని ఈ నెల డిసెంబర్31 వరకు ఇందిరమ్మ గృహ యాప్ సర్వే ఉంటుందని తెలిపారు ఇందిరమ్మ గృహ యాప్ లో పేర్లు లేని వారు ప్రభుత్వం మళ్లీ పేర్లు నమోదు కార్యక్రమం ప్రకటించినప్పుడు అప్పుడు ఇందిరమ్మ గృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

# పీవీ ఘాట్ వద్ద నివాళులు

**కబురు న్యూస్, హైదరాబాదు డిసెంబర్**

భారత రత్న స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి 20 వ వర్ధంతి సందర్భంగా పీవీ ఘాట్ వద్ద నివాళులు అర్పించిన రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ స ల హా దా రు , కే.కేశవరావు అనంతరం పీవీ నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి భారతరత్న క్యాలండర్ ను ఆవిష్కరించారు.పీవీ నరసింహారావు ఘాట్ ప్రాంగణంలో ఐ క్యాంప్ ను ప్రారంభించి కళ్లద్దాలు అందజేశారు..మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ ముద్దు బిడ్డ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేను ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ కి సంబంధించిన బిడ్డవారు అంత అత్యున్నత స్థానానికి ఎదగడానికి మన అందరికీ గర్వ కారణం వారి వర్ధంతి సందర్భంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాంవారి జ్ఞాపకాన్ని ,వారు ఇచ్చిన మార్గదర్శకత్వం ఈనాటి యువత అవలంభించినట్లైతే అందరూ సన్మార్గంలో నడుస్తారుబహుభాషా కోవిదుడు గా, అపార జ్ఞానంతో , అపార చాణక్యుడిగా రాజకీయంగా పదవులే తన వద్దకు వచ్చే విధంగా మౌనంగా ఉంటూనే ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక దేశం అయినా గా మారు మూల ప్రాంతం నుండి భారత ప్రధాని కావడం మన అందరికీ గర్వ కారణంఈరోజు ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగి ఇతర దేశాలతో నిల్బడడంలో ఆర్థిక సంస్కరణలు చేసిన ఘనుడువిదేశాంగ విధానం ,విద్యా వ్యవస్థ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు అనేకమైన సంస్కరణలు తెచ్చిన పీవీ నరసింహారావు గారికి ఘన నివాళులు అర్పిస్తూన్న కుటుంబ సభ్యులందరూ కూడా మంచి సన్మాన మార్గంలో ఉన్నారు ,యువత ఆర్థిక సంస్కరణల్లో ఆయన ను ఆదర్శంగా తీసుకుంటే విజయాలు సాధిస్తారు .



# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కారించాలి ....

## అదనపు కలెక్టర్ డి.వేణు

**కబురు న్యూస్, పెద్దపల్లి, డిసెంబర్ 23:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులకు తెలిపారు.సోమవారం ప్రజావాణి సందర్భంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. మంథని పట్టణానికి చెందిన ఏ. శంకర్ గౌడ్ మంథని గీత పారిశ్రామిక సహకార సంఘం పరిధిలోని కే.శంకర్ గౌడ్ అనుమతి లేకుండా ఈత తాటి చెట్లను గీస్తున్నారని, ఇతనిపై ఫిర్యాదు చేసినప్పటికీ సీఐ అధికారి ఎటువంటి చర్యలు తీసుకోలేదని, సంబంధిత అధికారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుని గీత కార్మికులు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా అబ్కారీ శాఖ అధికారి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.రామగుండం 6వ డివిజన్ కు చెందిన ఎం.లక్ష్మన్ వృద్దాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ధర్మారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బి.సంతోష్ నాయక్ తనకు కార్పొరేషన్ ద్వారా టీ స్టాల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, నాయందు దయ తలిచి దానికి సంబంధించిన డబ్బులు త్వరగా వచ్చేటట్లు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి రాస్తూ విచారించి వెంటనే చర్యలు చేపట్టాలని అదుపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ముగ్గుల పోటీలు

**కబురు న్యూస్, శేర్లింగంపల్లి డిసెంబర్ 23**

కొండాపూర్ లోని మహిళా కేంద్ర సహకార సంక్షేమం, కొమిరిశెట్టి ఫౌండేషన్ మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించిన ముగ్గుల పోటిలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు మరియు గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ కొమిరిశెట్టి సాయిబాబా గారు. కార్యక్రమంలో భాగంగా ముగ్గుల పోటీలలో విజేతలుగా నిలిచిన మహిళలలకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రామస్వామి యాదవ్, వరలక్ష్మి, ట్రెసరర్ చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.




తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY



# జైలర్ 2 సన్నాహాలు

కబురు సినిమా డిసెంబర్ 23..



టైగర్ కా హుకూమ్ అంటూ 'జైలర్' సినిమాలో అగ్రకథానాయకుడు రజనీకాంత్ చేసిన హంగామా ప్రేక్షకులను మెప్పించింది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ సినిమా గతేడాది విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఈ క్రైమ్ థ్రిల్లర్‌కు కొనసాగింపుగా 'జైలర్ 2' రాబోతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను మార్చిలో మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో రజనీని తొలి భాగం కన్నా మరింత స్టైలిష్‌గా చూపించనున్నారని, త్వరలో చిత్రీకరణ గురించి అధికారికంగా ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' సినిమాతో బిజీగా ఉన్నారు.

# పోరాడుతూ మరణించాలంతే!

కబురు సినిమా డిసెంబర్ 23..

"తల్లి ఆశీర్వాదం బిడ్డకు ఎప్పుడూ తోడుంటుందంటారు. కానీ నా బిడ్డ విషయంలో మాత్రం అది శాపంగా మారింది" అంటోంది ఓ తల్లి. మరి ఆమె ఆశీర్వాదం తన బిడ్డకు ఎందుకు శాపంగా మారిందో తెలుసుకోవాలంటే 'గాంధారి' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయిక తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. దేవాశిశ్ మఖిజా తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ మొదలైనట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫొటోల్ని పంచుకుంది తాప్సి . "సమయం వచ్చినప్పుడు నేను యుద్ధరంగంలో వీరోచితంగా పోరాడుతూ మరణించాలి. కానీ ఎప్పుడూ శత్రువుల ముందు భయం ప్రదర్శించొద్దు. ఇప్పుడు పోరాటం ప్రారంభిద్దాం" అని వ్యాఖ్యల్ని జోడించింది. ఇందులో ప్రతీకారం తీర్చుకునే ఓ శక్తిమంతమైన తల్లిగా కనిపించనుందామె. ఈ చిత్రాన్ని కనికా ఢిల్లాన్ నిర్మిస్తోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపింది చిత్రబృందం.



# సీఎం రేవంత్‌రెడ్డిని కలవనున్న టాలీవుడ్ ప్రముఖులు

కబురు సినిమా డిసెంబర్ 23..

పుష్పా-2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో ఇకపై ప్రీమియర్ షోలకు అనుమతి ఇచ్చేదిలేదని కాంగ్రెస్ సర్కార్ ప్రకటించింది. అదేవిధంగా సినిమా రేట్ల పెంపుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. చారిత్రక, తెలంగాణ ఉద్యమం వంటి సినిమాలకు మాత్రమే టికెట్ల రేట్లు పెంపు అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిని తెలుగు సినీ ప్రముఖులు కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. రామ్‌చరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఎఫ్‌డీసీ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిని కలవడంపై నిర్ణయం తీసుకుంటామని నిర్మాత నాగవంశీ చెప్పారు. టికెట్ ధరల పెంపు, ప్రీమియర్ షోలపై చర్చిస్తామని వెల్లడించారు. సంధ్య థియేటర్ వద్ద అనుకోని ఘటన జరిగిందన్నారు. ఏ హీరో, నిర్మాత అలా జరగాలని కోరుకోరని చెప్పారు. సినీ పరిశ్రమ ఏపీకి తరలిపోతుందనేది అవాస్తవమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమకు అక్కడి ప్రభుత్వం సహకరిస్తున్నదని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో షూటింగ్‌లు జరుగుతున్నాయని చెప్పారు.



# చిరు ఫ్యాన్స్ తిట్టుకున్నా.. పర్వాలేదు

## వాల్తేరు వీరయ్య కంటే డాకు మహారాజ్ బాగా తీశాడు : నాగవంశీ

కబురు సినిమా డిసెంబర్ 23..

సినిమా విడుదల సమయంలో సెన్సేషనల్ కామెంట్స్ చేసే నిర్మాత సూర్యదేవర నాగవంశీ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మెగాస్టార్ అభిమానులు తిట్టుకున్నా ఫర్వాలేదు. కానీ దర్శకుడు బాబీ 'వాల్తేరు వీరయ్య' కంటే 'డాకు మహారాజ్' సినిమాని బాగా తీశాడు' అని కామెంట్స్ చేశాడు. ఈ విషయంలో చిరంజీవి ఫ్యాన్స్ తనని తిట్టుకున్నా పర్లేదని స్టేట్ మెంట్ ఇచ్చారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాగవంశీ ఈ వ్యాఖ్యలు చేశారు. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో నాగవంశీ నిర్మించిన చిత్రం 'డాకు మహారాజ్'. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. బాబీ దేవోల్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా




జనవరి 12న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే జనవరి 4న అమెరికాలో ఓ ఈవెంట్ ప్లాన్ చేశారు. మరో ఈవెంట్ విజయవాడలో నిర్వహిస్తామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ " బాలకృష్ణతో వర్క్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. ఇప్పటికి కుదిరింది. ఈ సినిమాలో ఆయన్ని చాలా కొత్తగా చూస్తారు. ఇప్పటివరకు ఏ సినిమాలోనూ ఇలాంటి లుక్‌లో ఆయన కనిపించలేదు. అఖండ, లెజెండ్ గురించి ఎలా చెప్పుకుంటున్నారో దీని గురించి కూడా అలానే మాట్లాడుకుంటారు. సినిమా ఇంటర్వెల్‌లోనే నాకు ఫోన్ చేసి ఈ మాట చెబుతారు. ఈ సినిమాకు సంబంధించి మూడు గ్రాండ్ ఈవెంట్స్ ప్లాన్ చేశాం. జనవరి 2న హైదరాబాద్‌లో ట్రైలర్ రిలీజ్ చేయాలనుకుంటున్నాం. తర్వాత రెండు రోజులకు అమెరికాలో ప్రీరిలీజ్ ఈవెంట్ చేసి అక్కడ ఓ పాటను విడుదల చేయనున్నాం. జనవరి 8న ఆంధ్రప్రదేశ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నాం.

# రామ్‌చరణ్‌కి జాతీయ పురస్కారం వస్తుంది

కబురు సినిమా డిసెంబర్ 23..

'గేమ్ ఛేంజర్' పతాక సన్నివేశాల్లో రామ్‌చరణ్ నటనని చూశాక తనకి కచ్చితంగా జాతీయ పురస్కారం వస్తుందనే అభిప్రాయం కలిగిందన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్. ఆయన ముఖ్య అతిథిగా అమెరికాలోని డల్లాస్‌లో 'గేమ్ ఛేంజర్' విడుదలకి ముందస్తు వేడుక జరిగింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా... శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. కియారా అద్వాణీ కథానాయిక. జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ సంస్థలతో కలిసి శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది.ఈ సందర్భంగా వేడుకని ఉద్దేశించి సుకుమార్ మాట్లాడుతూ.. "దర్శకుడు శంకర్ చేతుల మీదుగా ఫిల్మ్ ఫేర్ పురస్కారం తీసుకున్నా. ఆయన రామ్‌చరణ్‌తో సినిమా చేస్తున్నారని తెలియగానే చాలా సంతోషించా. ఈ విషయాన్ని రామ్‌చరణ్ మొదట నాకే చెప్పాడు. ఓ సినిమా చేసినప్పుడు నేను ఆ హీరోని ఎక్కువగా ప్రేమిస్తాను. 'రంగస్థలం' తర్వాత కూడా ఆ అనుబంధం రామ్‌చరణ్‌తో కొనసాగింది. చిరంజీవితో కలిసి 'గేమ్ ఛేంజర్' చూశాను. 'జెంటిల్‌మేన్', 'భారతీయుడు' చిత్రాలను ఎంతగా ఆస్వాదించానో, ఈ సినిమా అంత మంచి అనుభూతిని పంచింది. ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలు చూశాక రోమాలు నిక్కబొడుచుకున్నాయి. 'రంగస్థలం' సినిమాతోనే రామ్‌చరణ్‌కి జాతీయ పురస్కారం వస్తుందనుకున్నా. ఈసారి కచ్చితంగా వస్తుంది" అన్నారు.చిత్ర నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. "1998లో 'ఒకే ఒక్కడు' సినిమాతో మా ప్రయాణం ప్రారంభం అయింది. ఆయన నిర్మించిన 'వైశాలి' చిత్రాన్ని



తెలుగులో విడుదల చేశా. ఇప్పుడు 'గేమ్ ఛేంజర్' నిర్మించా. మా సంస్థలో ఇది 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్‌తో నేను ఎప్పుడూ సినిమాలు తీయలేదు. రామ్‌చరణ్ వల్లే ఈ సినిమా ఈ స్థాయికి వచ్చింది. సినిమాలో ఆయనకీ, ఎస్.జె.సూర్యకీ మధ్య సన్నివేశాలు మరో స్థాయిలో ఉంటాయి. రెండు రాష్ట్రాల్లో జరిగే రాజకీయ అంశాలు చాలా కనిపిస్తాయి. కానీ

ఇవన్నీ నాలుగేళ్ల క్రితమే శంకర్ రాసుకున్నారు. తమన్ మంచి సంగీతాన్ని ఇచ్చాడు. శంకర్ శిష్యుడని అనిపించుకుంటాడు. ఈ సంక్రాంతికి 'గేమ్ ఛేంజర్' పెద్ద హిట్ కాబోతోంది. పండుగకు రాబోతోన్న అన్ని చిత్రాలు సూపర్ హిట్ అవ్వాలి" అన్నారు.దర్శకుడు శంకర్ మాట్లాడుతూ.. "ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోయినా, తెలుగు ప్రేక్షకులు నాపై

ప్రేమ కురిపిస్తూనే ఉన్నారు. చిరంజీవితో సినిమా చేయాలని ఎంతో ప్రయత్నించాను. ఆ తరువాత మహేశ్ బాబు, ప్రభాస్‌లతో చేయాలనుకున్నా. రామ్ చరణ్‌తోనే అది కుదిరింది. ప్రభుత్వాధికారి, రాజకీయ నాయకుల మధ్య వచ్చే ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. దిల్ రాజు అంతా తానై ముందుకు నడిపించారు. తెలుగు సినిమాలో తెలుగు మ్యూజిక్ డైరెక్టర్ ఉండాలని అనుకున్నాను. తమన్ మీద చాలా బాధ్యత, ఒత్తిడి ఉండేది. కానీ ఆయన అద్భుతమైన పాటల్ని ఇచ్చారు. సోషియో, పొలిటికల్, మాస్ ఎంటర్‌టైనర్‌గా 'గేమ్ ఛేంజర్' రాబోతోంది" అన్నారు.రామ్‌చరణ్ మాట్లాడుతూ.. 'శంకర్ చేసిన 'స్నేహితుడు' సినిమా వేడుకకి అతిథిగా హాజరయ్యా. అప్పుడు 'నాతో కాకపోయినా, ఎవరితో అయినా సరే ఓ తెలుగు సినిమా చేయండి' అని చెప్పాలనుకున్నా చెప్పలేకపోయా. క్రికెట్‌కు సచిన్ ఎలాగో.. ఇండియన్ సినిమాకు శంకర్ అలా. అలాంటి దర్శకుడితో సినిమా చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఏ ఒక్కర్నీ నిరాశపర్చదు" అన్నారు. ఈ కార్యక్రమంలో తమన్, కథానాయిక అంజలి, దర్శకుడు బుచ్చిబాబు సానా, నిర్మాత అనిల్ సుంకర, నటుడు ఎస్.జె.సూర్య, రాజేశ్ కల్లెపల్లి తదితరులు పాల్గొన్నారు. హ్యాపి హ్యాపీ లైఫ్‌కు మైక్రో మంత్ర దోప్... అంటూ సాగే 'గేమ్ ఛేంజర్' పాటని డల్లాస్‌లో జరిగిన వేడుకలో విడుదల చేశారు. తమన్ స్వరకల్పనలోని ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, రోషిణి జేకేవీ, పృథ్వీ, శ్రుతి రంజనితో కలిసి

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com